

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 09-10-2025 | సంపుటి - 25 | సంచిక -145 | రూ : 4 | పేజీలు: 8




2లో

## దగ్గు సిరప్ తో చిన్నారుల మృతి..

### ఇతర దేశాలకు ఎగుమతిపై ఆరా తీసిన ప్రపంచ ఆరోగ్య సంస్థ

- కోల్డ్‌రిఫ్ దగ్గు మందును ఇతర దేశాలకు ఎగుమతి చేశారా అని డబ్ల్యుహెచ్ఓ అడిగిందని మీడియాలో కథనాలు
- వివరణ ఇచ్చిన సంబంధిత అధికారులు
- గ్లోబల్ మెడికల్ ప్రొడక్ట్ అలర్ట్ జారీ చేయాలా అని అడిగిన డబ్ల్యూహెచ్ఓ

## ఎడారి గాలి నుంచి స్వచ్ఛమైన నీరు



2లో

- 2025 సంవత్సరానికి రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి ప్రకటన
- సుసుము కిటగావా, రిచర్డ్ రాబ్సన్, ఒమర్ యాఘీలకు సంయుక్తంగా పురస్కారం
- 'మెటల్-ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్' అభివృద్ధికి గాను ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు





2లో

## స్వదేశీ మంత్రాన్ని స్వీకరించండి.. దేశాన్ని బలోపేతం చేయండి

- నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం మొదటి దశను ప్రారంభించిన ప్రధాని మోదీ
- ప్రతి ఒక్కరూ 'స్వదేశీ' మంత్రాన్ని పాటించాలని ప్రజలకు పిలుపు
- దేశీయ వస్తువుల వాడకంతోనే అభివృద్ధి, ఉద్యోగాల కల్పన సాధ్యమని స్పష్టం



## బీఆర్ఎస్ గెలిస్తేనే ప్రభుత్వానికి చెక్ పడుతుంది

2లో

- కేటీఆర్, హరీశ్ రావు
- ఉప ఎన్నికలపై కేటీఆర్, హరీశ్ రావు దిశానిర్దేశనం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని వ్యాఖ్య

# జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్..

- సర్వే ఫలితాల ఆధారంగా ఆయనవైపే పార్టీ మొగ్గు
- 13 నుంచి బై పోల్ నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

4లో



## బీసీ రిజర్వేషన్ల అంశంపై వాడివేడిగా వాదనలు..

### విచారణ రేపటికి వాయిదా వేసిన హైకోర్టు

- రేపు మధ్యాహ్నం తదుపరి వాదనలు వింటామన్న హైకోర్టు
- రిజర్వేషన్లు 50 శాతం దాటడం రాజ్యాంగ విరుద్ధమన్న పిటిషనర్
- సమగ్ర అధ్యయనం తర్వాతే బిల్లు తీసుకువచ్చామన్న ప్రభుత్వం

2లో



## మరింత విజయవంతం చేద్దాం

### ప్రధాని మోదీ ఏపీ పర్యటన ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు సమీక్ష

- ఈ నెల 16న ఆంధ్రప్రదేశ్‌కు రానున్న ప్రధాని మోదీ
- శ్రీశైలం మల్లన్నను దర్శించుకోనున్న నరేంద్ర మోదీ
- కర్నూలు జిల్లా ఓర్వకల్లులో భారీ బహిరంగ సభ
- జీఎస్టీ సంస్కరణల ఉత్సవంలో పాల్గొననున్న ప్రధాని
- ప్రధాని పర్యటనను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కూటమి ప్రభుత్వం
- సభను విజయవంతం చేయాలని అధికారులకు సీఎం ఆదేశాలు

2లో



# మరింత విజయవంతం చేద్దాం... ప్రధాని మోదీ ఏపీ పర్యటన ఏర్పాట్లపై సీఎం సమీక్ష

అమరావతి, అక్టోబర్ 08 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్ పర్యటనను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ నెల 16న ప్రధాని మోదీ రాష్ట్రానికి రానున్న నేపథ్యంలో, ఆయన పర్యటన ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ పర్యటనను గతంలో అమరావతి, విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమాలను మించి విజయవంతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ మొదట ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తిపీఠ క్షేత్రమైన శ్రీశైలాన్ని సందర్శించి, భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకోనున్నారు. అనంతరం కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలో ఏర్పాటు చేయనున్న భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగిస్తారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణలకు మద్దతుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'జీఎస్టీ సంస్కరణల ఉత్సవ్' కార్యక్రమంలో భాగంగా ఈ సభను నిర్వహిస్తున్నారు. ఈ సంస్కరణలను స్వాగతిస్తూ దేశంలోనే తొలిసారిగా ఏపీ అసెంబ్లీలో అభినందన తీర్మానం చేసిన విషయం తెలిసిందే. దసరా నుంచి దీపావళి వరకు జరుగుతున్న ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రధాని సభను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, ఆహార సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు. సభా ప్రాంగణానికి వెళ్లే అప్రోచ్ రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు నారా లోకేశ్, బీసీ జనార్దన్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, కందుల దుర్గేశ్ తో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## స్వదేశీని మంత్రాన్ని స్వీకరించండి, దేశాన్ని బలోపేతం చేయండి

ముంబై, అక్టోబర్ 08 : దేశ ప్రజలు 'స్వదేశీ'ని స్వీకరించి, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. బుధవారం నవీ ముంబైలో అంతర్జాతీయ విమానాశ్రయం (NMIA) మొదటి దశను ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. స్వదేశీ వస్తువుల వాడకం వల్ల దేశంలో అభివృద్ధి వేగవంతం అవ్వడమే కాకుండా, యువతకు మరిన్ని ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఆయన అన్నారు. "ప్రతి ఒక్కరూ గర్వంగా 'స్వదేశీ' అని చెప్పాలి. ఇది ప్రతి పౌరుడికి, మార్కెట్‌కు ఒక మంత్రంలా మారాలి. ప్రజలు దేశీయ వస్తువులను కొనుగోలు చేసి, వాటినే బహుమతులుగా ఇస్తే ఆ డబ్బు తిరిగి మన ఆర్థిక వ్యవస్థకే చేరుతుంది. తద్వారా వృద్ధి, ఉపాధి పెరుగుతాయి" అని ప్రధాని మోదీ వివరించారు. జీఎస్టీ సంస్కరణల వల్ల దేశానికి, ప్రజలకు ఎంతో మేలు జరిగిందని, ఇటీవల ముగిసిన నవరాత్రుల్లో అమ్మకాలు భారీగా జరగడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ గత యూపీఏ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 2008 ముంబై ఉగ్రదాడుల తర్వాత పాకిస్థాన్‌పై ఎందుకు దాడి చేయలేదని, ఎవరి ఒత్తిడితో ఆనాటి ప్రభుత్వం ఆ నిర్ణయం తీసుకుందో దేశం తెలుసుకోవాలనుకుంటోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ బలహీన విధానాల వల్లే ఉగ్రవాదులు రెచ్చిపోయారని, దేశ భద్రత బలహీనపడిందని ఆరోపించారు. తమ ప్రభుత్వానికి మాత్రం దేశ భద్రతే అత్యంత ప్రాధాన్యమని, 'ఆపరేషన్ సిందూర్' ద్వారా పాకిస్థాన్‌కు గట్టి సమాధానం ఇచ్చామని గుర్తుచేశారు. అంతేకాకుండా, మహారాష్ట్రలోని గత మహా వికాస్ అఘాడీ ప్రభుత్వం అనేక అభివృద్ధి ప్రాజెక్టులను నిలిపివేయడం వల్ల దేశానికి తీవ్ర నష్టం వాటిల్లిందని మోదీ విమర్శించారు. నవీ ముంబై విమానాశ్రయం, ఇతర కనెక్టివిటీ ప్రాజెక్టులతో ముంబై నగరం ప్రపంచస్థాయి వృద్ధి కేంద్రంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. "ఈ ఎయిర్‌పోర్ట్ 'వికసిత భారత్' సంకల్పానికి ప్రతీక. దీని ద్వారా రైతులు తమ ఉత్పత్తులను యూరప్, గల్ఫ్ దేశాలకు సులభంగా ఎగుమతి చేయవచ్చు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు లబ్ధి చేకూరుతుంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ ముంబై మెట్రో లైన్ 3 చివరి దశను కూడా ప్రారంభించారు. దీంతోపాటు 'ముంబై వన్ యాప్', యువతకు ఉపాధి ఆధారిత శిక్షణ అందించే 'ముఖ్యమంత్రి షార్ట్‌టర్మ్ ఎంప్లాయబిలిటీ ప్రోగ్రామ్ (STEP)'ను కూడా ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజల కోసం విశేష కృషి చేసిన లోక్‌నేత డీబీ పాటిల్ సేవలను ఆయన స్మరించుకున్నారు.



## కనీస మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేయాలి
### : అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

* **రైతులు నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ జిన్నింగ్ మిల్లులకు పత్తిని తీసుకు రావాలి.**
* **పత్తి కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలి.**
* **పత్తి అమ్ముకొనుటకు రైతు స్లాట్ బుకింగ్ తప్పకుండా చేసుకోవాలి.**

భూపాలపల్లి, అక్టోబర్ 8 : పత్తి పంటను కనీస మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ ఆదేశించారు. మంగళవారం అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, జిల్లా మార్కెటింగ్, పోలీస్, వ్యవసాయ, విద్యుత్, రవాణా, తూనికలు కొలతలు అధికారులతో పత్తి కొనుగోలు ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2025-26లో జిల్లాలో 98,260 ఎకరాలలో పత్తి సాగు జరిగిందని, 11,79,000 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అక్టోబర్ మాసం తర్వాత పత్తి దిగుబడి ప్రారంభమవుతుందని, నవంబర్, డిసెంబర్ నెలల్లో అధికంగా పంట రాక ఉంటుందని వివరించారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కంటే తక్కువగా మార్కెట్‌లో రేటు పలికితే వెంటనే సీసీఐ కేంద్రాల ద్వారా మద్దతు ధర కల్పించాల్సి ఉంటుందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేసేందుకు భూపాలపల్లి, కాటారం మరియు చిట్యాల మార్కెట్ పరిధిలో మొత్తం 5 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పత్తి తేమ శాతం 8% ఉన్నప్పుడు కనీస మద్దతు ధర రూ. **8,110/**గా ఉన్నదని చెప్పారు. రైతులు తమ పత్తిని మధ్యవర్తులు లేదా దళారులకు అమ్మకుండా, కనీస మద్దతు ధర కంటే తక్కువ ధర పలికినప్పుడు సీసీఐ కేంద్రాలలో అమ్మాలని సూచించారు. జిన్నింగ్ మిల్లుల్లో నీరు, విద్యుత్, టాయిలెట్ సదుపాయాలు, తేమ యంత్రాలు, వెయింగ్ యంత్రాలు మొదలైన మౌలిక వసతులు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులు తమ బ్యాంకు ఖాతాలను ఆధార్ కార్డుతో లింక్ చేసుకోవాలని, దానిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. రైతులకు స్లాట్ బుకింగ్ తప్పనిసరి అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అన్నారు. రైతులు పత్తి పంటను జిన్నింగ్ మిల్లు లేదా పత్తి కొనుగోలు కేంద్రానికి తీసుకువెళ్లే ముందు 'కప్పాస్ కిసాన్ యాప్' ద్వారా తప్పనిసరిగా స్లాట్ బుకింగ్ చేసుకోవాలన్నారు." స్లాట్ బుకింగ్ చేయని రైతుల పత్తిని కొనుగోలు కేంద్రంలో స్వీకరించరని స్పష్టం చేశారు. ఈ చర్య రైతుల రాకపోకలు సౌకర్యవంతంగా ఉండటానికి, జిన్నింగ్ మిల్లుల సామర్థ్యానికి అనుగుణంగా ప్రతిరోజు పరిమిత సంఖ్యలో పత్తి లాట్లు స్వీకరించేందుకు ఉద్దేశించిందని తెలిపారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్దతు ధర కంటే తక్కువకు పత్తి అమ్మవద్దని, ప్రైవేట్ వ్యాపారులు లేదా మధ్యవర్తుల వాగ్దానాలకు లోనుకాకూడదని స్పష్టంచేశారు. పత్తి పంట తేమ శాతం పై కరపత్రాలు, అవగాహన ప్రచారం విస్తృతంగా చేపట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో అగ్నిప్రమాద నివారణ చర్యలు పటిష్టంగా తీసుకోవాలని, నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని తెలిపారు. రైతులు 'కప్పాస్ కిసాన్ యాప్' ద్వారా రిజిస్టర్ అయి, స్లాట్ బుకింగ్ చేసుకొని పత్తిని అమ్ముకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, అడిషనల్ ఎస్పి నరేష్ కుమార్, విద్యుత్ శాఖ ఎస్ ఈ మల్చూర్, జిల్లా అగ్నిపక అధికారి వి సతీష్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, జిల్లా తూనికలు కొలతల అధికారి శ్రీలత, రవాణా శాఖ అధికారి సంధాని, సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లు యజమానులు, మార్కెట్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ గెలిస్తేనే
## ప్రభుత్వానికి చెక్ పడుతుంది: కేటీఆర్, హరీశ్ రావు

హైదరాబాద్, అక్టోబర్ 08 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపొందినప్పుడే రాష్ట్ర ప్రభుత్వానికి అడ్డుకట్ట వేయగలమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు స్పష్టం చేశారు. ఉప ఎన్నికల్లో ఐక్యంగా పనిచేసి పార్టీ అభ్యర్థి మాగంటి సునీత విజయానికి కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలపై కేటీఆర్, హరీశ్ రావు పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత నెలకొందని అన్నారు. దీనిని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఎన్నికల బాధ్యతలు అప్పగించిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్‌ఛార్జిలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఎవరికి అప్పగించిన పనులకు వారు పూర్తిస్థాయిలో బాధ్యత వహించాలని తెలిపారు. బాకీ కార్డుల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పాదయాత్రలు చేపట్టాలని అన్నారు. బూత్ కమిటీలు నిరంతరం ఓటర్లతో సంప్రదింపులు జరపాలని పేర్కొన్నారు. ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవాలని ఆకాంక్షించారు. ప్రచారం చివరి దశలో రోడ్డు షోలు నిర్వహించాలని నిర్ణయించారు.

## బీసీ రిజర్వేషన్ల అంశంపై వాడివేడిగా వాదనలు..
## విచారణ రేపటికి వాయిదా వేసిన హైకోర్టు

హైదరాబాద్, అక్టోబర్ 08 : తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టులో విచారణ జరిగింది. తదుపరి విచారణను రేపు మధ్యాహ్నం 2.15 గంటలకు వాయిదా వేసింది. స్థానిక ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ జారీ చేస్తే స్టే ఇవ్వాలని పిటిషనర్ కోరారు. పిటిషనర్ విజ్ఞప్తిని న్యాయస్థానం పరిగణనలోకి తీసుకోలేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ జీవోను పలువురు హైకోర్టులో సవాల్ చేశారు. మరోవైపు, బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా ఆర్. కృష్ణయ్య, వి. హనుమంతరావుతో పాటు పలువురు బీసీ నాయకులు ఇంప్లీడ్ అయ్యారు. అన్ని పిటిషన్లను కలిపి సీజే జస్టిస్ ఏకే సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, రిజర్వేషన్లు 50 శాతం దాటడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. విద్య, ఉద్యోగాల్లో 50 శాతం దాటినా రాజకీయ రిజర్వేషన్లు పెంచరాదని అన్నారు. ఏజెన్సీల్లో ఎస్టీలకు మాత్రమే రిజర్వేషన్ సీలింగ్ వర్తించదని పేర్కొన్నారు. 42 శాతం రిజర్వేషన్లకు శాస్త్రీయ ఆధారాలు చూపలేదని, బీసీ కులగణన చేశారు కానీ బహిర్గతం చేయలేదని కోర్టుకు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ జనాభాను పరిగణనలోకి తీసుకోకుండా బీసీ రిజర్వేషన్లు ఎలా పెంచుతారని ప్రశ్నించారు. 2018లో 34 శాతం బీసీ రిజర్వేషన్లను ఇదే న్యాయస్థానం కొట్టివేసిందని గుర్తు చేశారు. రాజ్యాంగబద్ధ ఎన్నికల నిర్వహణకు తాము వ్యతిరేకం కాదని, రాజ్యాంగ విరుద్ధంగా నిర్వహిస్తే ఎలా అని ప్రశ్నించారు. ప్రభుత్వం తరఫున అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించాయని కోర్టుకు తెలిపారు. రాజకీయాలకతీతంగా మద్దతు లభించిన తర్వాత జీవోపై స్టే ఇవ్వాలని కోరడం సరికాదని అన్నారు. సమగ్ర కులగణన ద్వారానే ప్రభుత్వం ముందుకు వెళుతోందని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం నిర్ణయాలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని, కానీ డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం రిజర్వేషన్లను 50 శాతానికి మించి పెంచవచ్చని తెలిపారు. శాసన వ్యవస్థ చేసిన చట్టాన్ని ఎవరూ ప్రశ్నించలేరని సింఘ్వీ అన్నారు. సవరణ చేసినా, చట్టం చేసినా శాసన వ్యవస్థదే నిర్ణయమని అన్నారు. చట్టసభలు చేసిన చట్టాలను కొంతమంది గవర్నర్లు త్రిశంకు స్వర్గంలో ఉంచుతున్నారని కోర్టుకు తెలిపారు. కానీ నెలల పాటు ఏ నిర్ణయమూ చెప్పడం లేదని, బిల్లును ఆమోదించడం లేదు లేదా తిరస్కరించడం లేదని తెలిపారు. బీసీ రిజర్వేషన్ బిల్లు విషయంలోనూ గవర్నర్ ఇలాగే వ్యవహరించారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. వారి చర్యల వల్ల ప్రజల ఆకాంక్షలు నెరవేరడం లేదని అన్నారు. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ విడుదలైందని, ఈ ప్రక్రియలో కోర్టులు జోక్యం చేసుకోవద్దనే తీర్పులు ఉన్నాయని అన్నారు. ఈ సమయంలో స్టే ఇవ్వడం సరికాదని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. సమగ్ర అధ్యయనం తర్వాతే ఈ బిల్లును ప్రభుత్వం తీసుకువచ్చిందని, పూర్తి వాదనలు విన్న తర్వాత నిర్ణయం తీసుకోవాలని కోరారు. అనంతరం హైకోర్టు తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

## దగ్గు సిరప్ తో చిన్నారుల మృతి..
## ఇతర దేశాలకు ఎగుమతిపై ఆరా తీసిన ప్రపంచ ఆరోగ్య సంస్థ

ఢిల్లీ, అక్టోబర్ 08 : దగ్గు మందు కారణంగా మధ్యప్రదేశ్‌లో దాదాపు 20 మంది చిన్నారులు మృతి చెందడం దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. తమిళనాడులోని కాంచీపురానికి చెందిన శ్రీసన్ ఫార్మా యూనిట్ తయారు చేసిన కోల్డ్‌రిఫ్ దగ్గుమందు ఈ చిన్నారుల మరణాలకు కారణమైంది. ఈ ఘటనపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) స్పందించింది. ఈ సిరప్‌ను ఇతర దేశాలకు ఎగుమతి చేశారా అని భారత్ నుంచి వివరాలు కోరింది. ఈ మేరకు ఆంగ్ల మీడియాలో కథనాలు వెలువడ్డాయి. చిన్నారుల మరణాలకు కారణమైన కోల్డ్‌రిఫ్ దగ్గు మందును ఇతర దేశాలకు ఎగుమతి చేశారా అని ప్రపంచ ఆరోగ్య సంస్థ అడిగిందని, సంబంధిత అధికారుల నుంచి వివరణ వచ్చిన తర్వాత ఈ ఔషధంపై గ్లోబల్ మెడికల్ ప్రొడక్ట్స్ అలర్ట్ జారీ చేయాలా? వద్దా? అని అంశంపై అంచనా వేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ భారత్‌ను కోరిందని ఆ కథనాల్లో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, దగ్గు మందు కారణంగా మధ్యప్రదేశ్‌లో మరణాల సంఖ్య పెరుగుతోంది. మృతుల సంఖ్య ఈరోజు 20కి చేరింది. ఒక్క చింద్వాడలోనే 17 మంది ప్రాణాలు కోల్పోయారని మధ్యప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రి రాజేంద్ర శుక్లా వెల్లడించారు. మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని ఆయన తెలిపారు. కాంచీపురానికి చెందిన శ్రీసన్ ఫార్మా యూనిట్ ఈ మందును తయారు చేసిందని, కంపెనీలో తనిఖీలు చేయగా సిరప్‌లో 48.6 శాతం డైఇథైలిన్ గ్లైకాల్ ఉందని తేలిందని అధికారులు తెలిపారు. ఇది అత్యంత విషపూరితమైన రసాయనమని పేర్కొన్నారు. కంపెనీపై చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ సిరప్‌పై తెలంగాణతో సహా పలు రాష్ట్రాలు నిషేధం విధించాయి.

## ఎడారి గాలి నుంచి స్వచ్ఛమైన నీరు...
## రసాయనశాస్త్రంలో ముగ్గురికి నోబెల్




నోయిడా, అక్టోబర్ 08 : ఎడారి గాలి నుంచి స్వచ్ఛమైన నీటిని సేకరించడం, వాతావరణంలోని హానికర కర్బన ఉద్గారాలను బంధించడం వంటి అసాధారణ పనులకు వీలు కల్పించే వినూత్న ఆవిష్కరణకు ఈ ఏడాది రసాయన శాస్త్రంలో అత్యున్నత పురస్కారం లభించింది. 2025 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతిని ముగ్గురు శాస్త్రవేత్తలు సంయుక్తంగా గెలుచుకున్నారు. జపాన్‌కు చెందిన సుసుము కిటగావా, ఆస్ట్రేలియాకు చెందిన రిచర్డ్ రాబ్సన్, అమెరికాకు చెందిన ఒమర్ ఎం. యాఘీలను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్టు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ బుధవారం ప్రకటించింది. 'మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్' (MOFs)గా పిలిచే ప్రత్యేకమైన అణు నిర్మాణాలను అభివృద్ధి చేసినందుకు గాను వారికి ఈ గౌరవం దక్కింది. ఈ శాస్త్రవేత్తలు లోహ అయాన్లను (మూలస్తంభాలుగా), పొడవైన కర్బన అణువులతో (సంధానకర్తలుగా) కలిపి సూక్ష్మస్థాయిలో ఖాళీలతో కూడిన స్ఫటికాలను రూపొందించారు. ఈ ఖాళీలు వాయువులు, ఇతర రసాయనాలను నిల్వ చేయడానికి లేదా రసాయనిక చర్యలు జరపడానికి గదుల్లా పనిచేస్తాయి. వీటిని ఉపయోగించి పర్యావరణంలోని విషవాయువులను నిల్వ చేయడం, నీటిలోని హానికర రసాయనాలను వేరుచేయడం, ఫార్మా వ్యర్థాలను విచ్ఛిన్నం చేయడం వంటి ఎన్నో క్లిష్టమైన సమస్యలకు పరిష్కారాలు కనుగొనవచ్చు. ఈ రంగంలో 1989లో రిచర్డ్ రాబ్సన్ తొలి అడుగులు వేయగా, ఆ తర్వాత సుసుము కిటగావా, ఒమర్ యాఘీ తమ పరిశోధనలతో దీనిని మరింత ముందుకు తీసుకెళ్లారు. కిటగావా ఈ నిర్మాణాల్లోకి వాయువులు స్వేచ్ఛగా ప్రవహిస్తాయని నిరూపించగా, యాఘీ అత్యంత స్థిరమైన MOFలను సృష్టించి, వాటిని మనకు కావాల్సిన విధంగా మార్చుకునే పద్ధతిని ఆవిష్కరించారు. వీరి కృషి ఫలితంగా ఇప్పటివరకు పదివేల రకాలకు పైగా MOFలు రూపుదిద్దుకున్నాయి. "మెటల్ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. మనకు అవసరమైన సరికొత్త ప్రయోజనాలతో పదార్థాలను రూపొందించుకోవడానికి ఇవి ఊహించని అవకాశాలను అందిస్తున్నాయి" అని నోబెల్ కమిటీ ఛైర్మన్ హైనర్ లింకే ఈ సందర్భంగా ప్రశంసించారు.

# గంజాయితో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులు రిమాండ్

మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి : గంజాయి తో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను మేడిపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... మేడిపల్లి ప్రశాంత్ నగర్ ఏరియాలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా లింగాల గణపురం గ్రామానికి చెందిన అన్న బోయిన కిరణ్ కుమార్ అలియాస్ పెద్ద పీకె (31), మేడిపల్లి, కాంతి కాలనీ కి చెందిన బక్కి నవీన్ (26 ) లు నిర్మానుష్య ప్రాంతంలో యాక్టివా పై అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు ఆధుపులోకి తీసుకొని విచారించగా వారి వద్ద 65 గ్రాముల గంజాయి దొరికింది. వెంటనే అట్టి వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి దగ్గర దాదాపుగా 65 గ్రాముల గంజాయి, ఒక యాక్టివా బైకు , సెల్ ఫోన్లు సీజ్ చేసి కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించారు.

*** గంజాయికి యువత దూరంగా ఉండాలి : మేడిపల్లి ఇన్స్పెక్టర్ గోవింద రెడ్డి**



మత్తు పదార్థాలకు, గంజాయికి యువత దూరంగా ఉండాలని మేడిపల్లి ఇన్స్పెక్టర్ గోవింద రెడ్డి అన్నారు. మత్తు పదార్థాల వినియోగం కారణంగా యువత జీవితాలు దుర్భరమవుతున్నాయని యువత మత్తుకు డ్రగ్స్ కు బానిసలై తమ జీవితాలను పాడు చేసుకుంటున్నారని, ఇందుకు కారణమవుతున్న గంజాయి , డ్రగ్స్ పై ఉక్కు పాదం మోపుతామని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఇప్పటికే బృందాలుగా ఏర్పడి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సీఐ తెలిపారు. డ్రగ్ రహిత సమాజం కోసం పాటుపడాలన్నదే తమ ధ్వేయమన్నారు. మత్తు పదార్థాలకు బానిసలుగా మారి యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురి కాకుండా చూడాలన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గంజాయి, డ్రగ్స్ , మత్తు పదార్థాలు త్రాగే వారు సేవించేవారు , విక్రయాలకు పాల్పడే వారి సమాచారాన్ని డయల్ 100 ద్వారా పోలీస్ వారికి సమాచారం అందించాలని కోరారు.

## మైత్రి ఫౌండేషన్ సేవలకు గుర్తింపు

**- నీలోఫర్ ఆసుపత్రి నుంచి ఎక్సలెన్స్ అవార్డు.**




జిన్నారం (గుమ్మడిదల), ప్రజాస్ఫూర్తి 08: గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన మైత్రి ఫౌండేషన్ సేవలకు గుర్తింపు లభించింది. నీలోఫర్ ఆసుపత్రిలో తలసేమియా పిల్లలు, గర్భిణీ స్త్రీల కోసం రక్తదాన శిబిరాలు నిర్వహించినందుకు ఆసుపత్రి సిఎస్ నాగజ్యోతి, సూపరిండెంట్ విజయ్ కుమార్లు ఫౌండేషన్ చైర్మన్ చెన్నంశెట్టి ఉదయకుమార్కు ఎక్సలెన్స్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఉదయకుమార్ మాట్లాడుతూ ఈ అవార్డు తమ సేవలకు లభించిన గౌరవమని, మాపై మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు.

## మహిళలపై నేరాలను అరికట్టే బాధ్యత మనందరిది

*** మేడిపల్లి ఎస్సై ఉదయ్ భాస్కర్**



మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి : మహిళలపై నేరాలను అరికట్టే బాధ్యత మనందరి పై ఉందని మేడిపల్లి ఎస్సై ఉదయ్ భాస్కర్ అన్నారు. బుధవారం చెంగిచర్ల గవర్నమెంట్ హైస్కూల్ విద్యార్థులకు "డ్రగ్స్ పైనా అవగాహన , మహిళలపై నేరాల నివారణ" పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి ఎస్సై ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని, ఆరోగ్యాన్ని నాశనం చేస్తుందని విద్యార్థినీలకు వివరించారు. డ్రగ్స్ వాడకంతో చదువు, ఉద్యోగాలు, కుటుంబ సంబంధాలు నశించిపోతాయని, వాటిని దూరం పెట్టి క్రీడలు, హాబీలు, పుస్తకాలు వంటి మంచి అలవాట్లు పెంపొందించుకొని సమాజాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. మహిళల పట్ల జరిగే నేరాలు చిన్న పిల్లల పట్ల జరిగే నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలపై నేరాలు సమాజానికి మచ్చవంటివని, ప్రతి విద్యార్థి అటువంటి నేరాలను వ్యతిరేకించే ధైర్యం చూపాలని పిలుపునిచ్చారు. ఎక్కడైనా మహిళలపై వేధింపులు, అనుచిత ప్రవర్తన, నేరాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ప్రతి ఒక్కరూ "సేఫ్ సొసైటీ" కోసం భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కు సంబంధించిన దాదాపు 100 విద్యార్థులు , స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## శివ శక్తి నగర్ ఫేస్ 1 కమాన్ ప్రారంభం



మేడిపల్లి, (ప్రజాస్ఫూర్తి) : బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ లో గల శివ శక్తి నగర్ ఫేస్ 1 కమాన్ ను బుధవారం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ కొత్త చందర్ గౌడ్, మాజీ కోఆప్షన్ మెంబెర్ రంగా బ్రాహ్మణ్ణి గౌడ్, కంటెస్టెడ్ కార్పొరేటర్లు కొత్త ప్రభాకర్ గౌడ్, కుర్రి శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ టపాసుల నిల్వ స్థావరాలపై టాస్క్ ఫోర్స్, పోలీసుల సంయుక్త దాడులు

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: దీపావళి టపాసుల అక్రమ నిల్వలపై బుధవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు జిల్లా టాస్క్ ఫోర్స్, భద్రాచలం పోలీసులు సంయుక్తంగా దాడులను నిర్వహించారు. భద్రాచలం పట్టణంలోని భగవాన్దాస్ కాలనీ, ఇండస్ట్రీయల్ ఏరియా, గ్యాస్ గోడౌన్ ఏరియాలలో జనావాస ప్రాంతాలలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా టపాసులు నిల్వ ఉంచిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. సుమారుగా రూ. 10 లక్షల విలువ గల దీపావళి టపాసులను స్వాదీనం చేసుకున్నారు. ఎవరైనా అనుమతులు లేకుండా, నియమ నిబంధనలను పాటించకుండా దీపావళి టపాసులను అక్రమంగా నిల్వ ఉంచితే కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాచలం సీఐ నాగరాజు హెచ్చరించారు. నివాస ప్రాంతాలలో ఉంచిన నిల్వల వలన గతంలో చాలా చోట్ల అగ్ని ప్రమాదాలు సంభవించి అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం జరిగిందన్నారు. ప్రజాహితార్థం ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా టపాసులను అక్రమంగా నిల్వ ఉంచినట్లు తెలిస్తే వెంటనే డయల్ 100కు గానీ, స్థానిక పోలీసులకు గానీ సమాచారం అందించాలని టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రమాకాంత్, సీఐ నాగరాజు కోరారు. ఈ దాడులలో టాస్క్ ఫోర్స్ సీఐ రమాకాంత్, ఎస్సైలు ప్రవీణ్, రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.



# కనీస వేతనం అమలు చేయాలి...

- **ఐకెపి వివోఏలకు కనీస వేతనం కోసం ఉద్యమిస్తాం...**
- **సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. సాయిలు**
- **జోగిపేట లో వి వో ఏ ల జిల్లా 4వ మహాసభలు**



అందోలు, ప్రజాస్ఫూర్తి: ఐకెపి వివో ఏ లకు కనీసం వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. సాయిలు అన్నారు. బుధవారం జోగిపేట లో వి వో ఏ ల జిల్లా 4వ మహాసభ లు స్థానిక శ్రీరామ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందాయి అన్నారు. కార్మిక హక్కులను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. కనీస వేతనం రూ.26 వేల వివో ఏలకు చెల్లించే వరకు కదం తొక్కుతామన్నారు. ఈఎస్ఐ, పిఎఫ్, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులు, పని భారం తగ్గించాలని, 10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం, గ్రేడింగ్ లేకుండా పారితోష్యాలు చెల్లించాలని, పని భారం తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. అంతకుముందు సిఐటియు జెండావిష్కరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు డి. విద్యాసాగర్, వివో ఏ సంఘం జిల్లా అధ్యక్షులు నగేష్, అందోల్ మండల అధ్యక్ష కార్యదర్శులు మల్లయ్య,రామన్నగారి ఆంజనేయులు, సభ్యులు అశోక్, గోపాల్, పాహిమ్, లాయక్, లక్ష్మి, కవిత, సునిత, విజయ వాసవి, వాసవి తదితరులు పాల్గొన్నారు.

## చర్లపల్లి వరద బాధిత ప్రాంతాలకు పనులు ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, కాప్రా : చర్లపల్లి డివిజన్లోని లక్ష్మీనగర్, బి.యన్.రెడ్డి, చక్రిపురం, నేతాజీ నగర్, సోనియా గాంధీ నగర్, విద్య మారుతి కాలనీ, భరత్ నగర్, కుషాయిగూడ, నాగార్జున కాలనీ, హనుమాన్ కాలనీ, వెంకట్ రెడ్డి నగర్ తదితర కాలనీలకు వెంటనే పనులు ప్రారంభించాలని హెచ్ఎండీబ్ల్యూఎస్ ఎండి అశోక్ రెడ్డి జీఎం సంతోష్ కు ఆదేశించారు. చర్లపల్లి ప్రాంతంలో ఇటీవల భారీ వర్షాలకు ముంపు ప్రభావం చూపిన మీనాక్షి నగర్, శుభోదయం నగర్, ఫుకట్ నగర్, కుషాయిగూడ, లక్ష్మీనరసింహ కాలనీ, కృష్ణ రెడ్డి నగర్, డాక్టర్స్ కాలనీ, లోకమాత కాలనీ ప్రాంతాల పరిస్థితులను స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ బొంతు శ్రీదేవి యాదవ్ వివరించారు. అశోక్ రెడ్డి స్పందిస్తూ, ప్రజలు వర్షాల కారణంగా ఇబ్బందులు పడుతున్నందున పనులు ఆలస్యం కాకుండా, తొందరగా చేపట్టాలని ఆదేశించారు. అలాగే, ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ కింద శ్రీకృష్ణారెడ్డి నగర్ యుజిడి కోసం 25 లక్షల రూపాయల సాంక్షన్ కూడా ప్రకటించారు. పనులు సకాలంలో పూర్తి చేయడం ద్వారా ప్రజలకు తక్షణ సౌలభ్యం కల్పించాలని కార్పొరేటర్ వివరించారు.

## నృత్య శిక్షకురాలికి మొక్కను అందజేసిన నైనిక రజువా



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: శాస్త్రీయ నృత్య శిక్షకురాలు పర్వీన్ చంద్రకు ప్రకృతి హరిత దీక్షకురాలు నైనిక రజువా మొక్కను అందచేశారు. కొత్తగూడెం పట్టణ పరిధిలోని పాత కొత్తగూడెంలోగల శ్రీ భారతి నాట్యాలయంలో బుధవారం నటరాజ పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నృత్య శిక్షకురాలు పర్వీన్ చంద్రను కలిసిన చిన్నారి నైనిక రజువా, తైవాన్ జామ మొక్కను అందచేవారు. ఈ సందర్భంగా నైనిక రజువాను అభినందిస్తూ శిక్షకురాలు పర్వీన్ చంద్ర మాట్లాడారు. ప్రకృతి ప్రేమికురాలు నైనిక రజువా స్ఫూర్తిగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. శాస్త్రీయ నృత్యం ద్వారా మన సాంప్రదాయాన్ని కాపాడుకున్న విధంగా మొక్కలను కాపాడుకోవాలని కోరారు. అదేవిధంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు.

## ఘనంగా కొలన్ శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు నిజాంపేటలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్చాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎం శ్రీనివాస్ (ఆటో) ఆధ్వర్యంలో కే ఎస్ ఆర్ తనయుడు కొలన్ తరుణ్ రెడ్డి , మన్నే మహేష్ యాదవ్ లు రాజేశ్వరి వృద్ధుల అనాధ ఆశ్రమం నందు పాల్గొని వారి యోగ క్షేమాలు తెలుసుకొని. వారి చేతుల మీదుగా వృద్ధులకు అన్నం వడ్డించి తండ్రికి తగ్గ తనయుడుగా నిలిచాడు. ఈ కార్యక్రమంలో గౌస్, సురేష్ నాయక్, ప్రసాద్ గౌడ్, బాలకృష్ణ, సుధాకర్, మిర్చి, భూషణం, మధు, గోపాల్, సత్యవతి, వరలక్ష్మి , కాంగ్రెస్ పార్టీ నాయకులు కేఎస్ఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కూకట్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా అధనపు కలెక్టర్



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి ) : కూకట్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, డీఈఓ విజయ కుమార్ లు బుధవారం సందర్శించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో ఇంటరాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంఈఓ , సిహెచ్ఎం లకు నిర్వహిస్తున్న సపోర్టివ్ సూపర్వైజర్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ పరిశీలించారు.

## అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం పట్టణ పరిధిలోని ప్రకాష్నగర్ అంగన్వాడీ కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారుల హాజరు, పోషకాహార పంపిణీ, ఆరోగ్య పర్యవేక్షణ, విద్యా కార్యక్రమాల అమలు విధానాలను కలెక్టర్ సమీక్షించారు. అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి, పిల్లలకు సమయానికి ఆహారం, పాలు, గుడ్లు అందజేయాలని ఆదేశించారు. గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులకు అందించే పోషకాహార పథకాలు సక్రమంగా అమలవుతున్నాయా అనే విషయంపై కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ భవనం పరిశుభ్రత, పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట వస్తువులు, నేర్చుకునే సామగ్రి వాడకం తదితర అంశాలపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి అంగన్వాడీ కేంద్రం బాలల సమగ్రాభివృద్ధికి కేంద్రబిందువుగా మారాలని, పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో అంగన్వాడీ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయ్ పై జరిగిన దాడిని ఖండిస్తూ ప్లకార్డులతో నిరసన



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ (బి.ఆర్) గవాయ్ పై జరిగిన దాడికి నిరసనగా డిహెచ్పిఎస్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం, కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ నందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి తొలుత పూలమాలవేసి ఘన నివాళులు అర్పించి అనంతరం ప్ల కార్డులతో నిరసన వ్యక్తం చేసిన సిపిఐ అనుబంధ సంఘం దళిత హక్కుల పోరాట సమితి (డి హెచ్ పి ఎస్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకత్వం. ఈ కార్యక్రమానికి డిహెచ్పిఎస్ జిల్లా నాయకులు బరిగెల భూపేష్ కుమార్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు,డిహెచ్పిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సలిగంటి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయ్ రాకేష్ కిషోర్ వేసిన పిల్ పై ప్రసంగిస్తూ మధ్యప్రదేశ్ లోని ఖజురహోలో నీ ఆలయాల విషయం భారత పురావస్తు శాఖ(ఆర్కియాలోజికల్ సర్వే ఆఫ్ ఇండియా) పరిధిలో ఉంటుందని మీరు సుప్రీంకోర్టు గుమ్మం తట్టే బదులు అక్కడికి వెళ్తే బాగుంటుందని సూచించారు, అందుకు ఆగ్రహించిన మతోన్మాది న్యాయవాది రాకేష్ కిషోర్ సనాతన ధర్మం జోలికి వస్తే ఈ దేశం సహించబోదని నినాదాలు చేస్తూ తన బూటు తో సీజేఐ పై దాడి చేయడానికి ప్రయత్నించగా మార్షల్స్ అడ్డుకోవడం జరిగిందన్నారు. భారతదేశ న్యాయ చరిత్రలో చీకటి అధ్యాయనమని పేర్కొన్నారు. దళిత జాతికి చెందిన జస్టిస్ గవాయ్ పై దాడి చేసిన సీనియర్ న్యాయవాది, మతోన్మాది రాకేష్ కిషోర్ పై తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుండి తక్షణమే బహిష్కరించి నాన్బెయిలబుల్ కేసు పెట్టాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఇది కేవలం జస్టిస్ గవాయ్ పై జరిగిన దాడి మాత్రమే కాదని భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా భావించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిహెచ్పిఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు చెన్నయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కరిషా రత్నకుమారి, రాష్ట్ర సమితి సభ్యురాలు మామిడి ధనలక్ష్మి, డి హెచ్ పి ఎస్ జిల్లా నాయకులు రవి కిరణ్, కొచ్చర్ల రాకేష్ కాంత్, టి. నర్సింగరావు ,జంగం ప్రసాదరావు, మంద నిర్మల, పి.భాగ్య, మద్దెల విజయలక్ష్మి, మెరుగు అనసూయ, దార్ల లక్ష్మి, అన్నెం లక్ష్మీనారాయణ,పి.రోజా, ఉస్మాన్ ఖాన్, పి.నర్సిరెడ్డి, బి. సత్తెమ్మ,కే. భారతి, ఎండి ఆశబి, ఎండి యాకుబ్ పాషా, ఎస్.కె అహ్మద్ పాషా బట్టు సన్నీ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మోసాలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ "బాకీ కార్డు" ఉద్యమం ప్రారంభం

* **మల్లాపూర్‌లో ఇంటింటా తిరిగి బాకీ కార్డుల పంపిణీ ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు హామీల పేరుతో బాకీ పడ్డ మొత్తాన్ని తక్షణం చెల్లించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మోసాలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ బాకీ కార్డు ఉద్యమాన్ని ప్రారంభించింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ వర్గానికి కాంగ్రెస్ ఎంత బాకీ ఉందో ఈ కార్డుల ద్వారా ఇంటింటికీ ప్రజలకు తెలియజేస్తాం. రాబోయే స్థానిక సంస్థల, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుదాం అని అన్నారు.రైతు బంధు, మహిళా పథకాలు, యువత ఉపాధి హామీలు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పాటు తులం బంగారం హామీ అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గవర్నమెంట్ హాస్పిటల్‌లో చికిత్స తీసుకున్న TG మంత్రి




చిన్న చిన్న పదవుల్లో ఉన్న వారు కూడా చికిత్స కోసం కార్పొరేట్ హాస్పిటల్స్‌కు వెళ్తున్న వేళ... సాక్షాత్తు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా వ్యవహరించిన తీరు వీఐపీలకు ఆదర్శంగా నిలిచింది. ఆరోగ్యశాఖ మంత్రి జ్వరంతో బాధపడుతూ మంగళవారం నిమ్స్‌లో అడ్మిట్ అయ్యారు. నిమ్స్ డైరెక్టర్, డాక్టర్ బీరప్ప నేతృత్వంలోని డాక్టర్ల బృందం ఆయనకు చికిత్స అందించింది. పూర్తిగా కోలుకోవడంతో బుధవారం ఆయనను నిమ్స్ వైద్యులు డిశ్చార్జ్ చేశారు. ఈ విధంగా ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు మంత్రి భరోసా కల్పించారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో చక్కని వైద్యం అందుతుందని.. సేవలను సద్వినియోగం చేసుకునాలనే సందేశమిచ్చారని వైద్యులు పేర్కొంటున్నారు.



## ప్రజలు, సమాజానికి ఉపయోగపడే విధంగా
## ఆర్టీఐ ద్వారా సమాచారం తక్షణం అందించాలి

* **జిల్లా కలెక్టర్ మను చౌదరి**

ప్రజాస్ఫూర్తి, కాప్రా : ప్రజలు , సమాజానికి ఉపయోగపడే విధంగా ఆర్టీఐ ద్వారా సమాచారం తక్షణం అందించాలి తద్వారా ప్రభుత్వ భూసంపత్తులు కాపాడబడగలవని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. సమాచార హక్కు చట్టం 2005 వారోత్సవాల సందర్భంగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా అధికారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా జిల్లా కలెక్టర్ ఆర్టిఐ చట్టంపై అవగాహనా సందేశం ఇచ్చారు. అనంతరం డి.సి.ఓ సమాచార హక్కు చట్టంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. అధికారులు, ఆర్టీఐ కార్యకర్తలు, ప్రజలు అడిగిన ప్రశ్నలకు అదిషనల్ కలెక్టర్ సమాధానమివ్వడం జరిగింది. ఈ సదస్సులో తాడూరి గగన్ కుమార్ కన్వీనర్, సమాచార హక్కు సాధన సమితి, మాట్లాడుతూ, జిహెచ్ఎంసి , రెవెన్యూ శాఖల నుండి ప్రభుత్వం భూసంపత్తి కాపాడడంలో సకాలంలో పూర్తి సమాచారం అందడంలో లోపమున్నదని జై జవాన్ కాలనీలో 10 షటర్ల స్వాధీనం పూర్తికావడానికి 12 సంవత్సరాలు పట్టిందన్నారు. అవినీతి అక్రమాలు బయటపడే అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. అంతేకాక, మండల స్థాయిలో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరాన్ని కూడా ఆయన ఉటంకించారు. ఈ సదస్సులో జిల్లా అధికారులు, ఆర్టీఐ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



## అట్టహాసంగా జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ పాఠశాలల క్రీడలు

ప్రజా స్ఫూర్తి , భద్రాద్రి కొత్తగూడెం: 69వ ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి క్రీడలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణం ప్రకాశం స్టేడియంలో నిర్వహిస్తున్న క్రీడలను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసంగిస్తూ గెలుపోటములు సహజమని, విజేతలైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతి క్రీడాకారుడు క్రీడల ద్వారానే బంగారు భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని, క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఏ విధమైన సహాయానికైనా డివైఎస్ఓ ద్వారా తనను సంప్రదించాలని సూచించారు. మొదటి రోజు 17 సంవత్సరాల విభాగంలోని బాలబాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి, తరువాత ఉమ్మడి జిల్లా జట్టుతో కలిపి రాష్ట్రస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ




వాసిరెడ్డి నరేష్ కుమార్ తెలియజేశారు. ఈ పోటీలలో డీవైఎస్ఓ పరంధామ రెడ్డి, డీసీఈబీ సెక్రెటరీ నీరజ, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులైన ప్రేమ్ కుమార్, యనమదల వేణుగోపాల్, యుగంధర్, స్టెల్లా, కవిత, వీరన్న, కృష్ణ, పామర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్.. ప్రకటించిన ఏఐసీసీ



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోటీ చేయబోయే అభ్యర్థిని అధికార కాంగ్రెస్ ప్రకటించింది. నవీన్ యాదవ్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తూ ఏఐసీసీ ఉత్తర్వులు జారీ చేసింది. అంజన్ కుమార్ యాదవ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు తమవంతు ప్రయత్నాలు చేసినా.. నవీన్ యాదవ్ వైపే హైకమాండ్ మొగ్గుచూపింది. అయితే ఆశావహులను సీఎం రేవంత్ రెడ్డి పిలిచి మాట్లాడారని, పార్టీ తప్పకుండా మీకు సముచితమైన గౌరవాన్ని ఇస్తుందని, పార్టీ ప్రకటించిన అభ్యర్థి గెలుపునకు సహకరించాలని నచ్చచెప్పడంతో వారు పోటీ నుంచి తప్పుకున్నట్లు సమాచారం. దీంతో స్థానిక కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్‌కు లైన్ క్లియర్ అయింది. కాగా, నవంబరు 11న జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉపఎన్నిక నిర్వహించనున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున పోటీ చేసి గెలిచిన మాగంటి గోపీనాథ్ (62) మృతితో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది.

## రాష్ట్రంలో గత పదేండ్లుగా వ్యవసాయ రంగం గాడి తప్పింది

: **చైర్మన్‌కోదండరెడ్డి**

* **సీఎం రేవంత్‌రెడ్డి అన్నదాతల అభివృద్ధికి పలు నిర్ణయాలు**
* **వ్యవసాయ రంగం బలోపేతం చేయడానికి రైతు కమిషన్ ఫోకస్**



రాష్ట్రంలో గత 10 ఏళ్లలో గాడి తప్పిన వ్యవసాయ రంగాన్ని సీఎం రేవంత్ రెడ్డి సరైన దారిలోకి తీసుకొస్తున్నారని రైతు కమిషన్‌చైర్మన్‌కోదండరెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయ రంగం బలోపేతం చేయడానికి కమిషన్ అన్ని అంశాలపై ఫోకస్ పెట్టిందన్నారు. బుధవారం కమిషన్ కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యానవన, ఫారెస్ట్, నాబార్డు, వ్యవసాయ శాస్త్రవేతలతో సమావేశం నిర్వహించారు. రైతులు కోతుల బెడదతో ఎదుర్కొంటున్న సమస్యలు, నివారణ చర్యలు, సోలార్ ఫెన్సింగ్ తోపాటు సాయిల్ టెస్ట్.. ఆవశ్యకతపై సుధీర్ఘంగా చర్చించినట్లు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోతుల బెడద, నివారణ కోసం చర్యలు చేపట్టాలని, అడవుల్లో కోతులకు సరైన ఆహారం దొరకడం లేదని, ఫలితంగా కోతులు గ్రామాల్లోకి, పంట పొలాలపైకి వస్తున్నట్లు పేర్కొన్నారు. కోతుల బెడదపోతే రాష్ట్రంలో కూరగాయలు, పండ్ల తోటల సాగు విస్తీర్ణం పెరుగుతోందన్నారు. పంట పొలాల చుట్టూ సోలార్ ఫెన్సింగ్ చేయాలంటే రైతులపై ఆర్థిక భారం పడుతుందని, అలా కాకుండా ఇతర నివారణ చర్యలపై ఫోకస్ పెట్టాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో యూరియా వినియోగం విపరీతంగా పెరిగిందని, భూ పరీక్షలు చేసిన తర్వాతనే పంటలు సాగుచేసేలా చర్చలు చేపట్టాలని ఆదేశించారు. అధిక మోతాదుల్లో యూరియా వాడకంతో గాలి, నీరు, వాతావరణం కలుషితం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారతీయ వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు రూపొందించిన సాయిల్ టెస్టింగ్ కిట్ డెమోను ఈ సమావేశంలో ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు ప్రదర్శించారు. ఐఐఆర్ఆర్ రూపొందించిన సాయిల్ టెస్ట్ కిట్ ను రైతు కమిషన్ కొనుగోలు చేసి.. వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి గోపికి అందజేసింది. భూ సార పరిక్షా పరికరాలు రైతులకు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాదిన్నర కాలంలోనే వ్యవసాయ రంగానికి లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. భవిష్యత్ లో వ్యవసాయ రంగంలో రావాల్సిన మార్పులు, అనుసరించాల్సిన విధానాలపై అధికారులతో చర్చించామన్నారు. వ్యవసాయ రంగానికి కేంద్రం నుండి వచ్చే నిధులు, నాబార్డు నిధుల వినియోగం సక్రమంగా జరిగేలా చూడాలని అధికారులకు చెప్పారు. ఈ సమావేశంలో రైతు కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి, భవానీరెడ్డి, గడుగు గంగాధర్, చెవిటి వెంకన్నయాదవ్, రాములు నాయక్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి, హార్టికల్చర్ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటీ వీసీ రాజిరెడ్డి, అటవీ శాఖ పీసీసీఎఫ్ ఎలుసింగ్ మేరు, నాబార్డు ఏజీఎం చంద్రశేఖర్, ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు బ్రజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ఆత్మహత్యలకు సీఎం రేవంత్ రెడ్డిదే పూర్తి బాధ్యత

* **వ్యవసాయ సంక్షోభం, ముఖ్యమంత్రి చేతకానితనమే కారణం : బీఆర్ఎస్**

రాష్ట్రంలో ఒకే రోజు ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమని వీటికి సీఎం రేవంత్ రెడ్డియే పూర్తి బాధ్యుడని బీఆర్ఎస్ పార్టీ తీవ్ర స్థాయిలో విమర్శించింది. రేవంత్ సర్కారు తీసుకొచ్చిన వ్యవసాయ సంక్షోభం, హామీల వైఫల్యం కారణంతో అన్నదాతలు తమ నిండు ప్రాణాలను బలి తీసుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంటూ ముఖ్యమంత్రి చేతకానితనంతో సృష్టించిన సాగునీటి సంక్షోభంతో బోర్లు వేసి, తీవ్రంగా నష్టపోయిన మొగిలి లక్ష్మణ్ ప్రాణాలు తీసుకుంటే రైతుబంధు వంటి




పెట్టుబడి సాయం లేక, ఆర్థిక భారంతో అప్పుల పాలై గూగులోత్ భాస్కర్ బలయ్యారని పేర్కొంది. భారీ వర్షాలతో నష్టపోయిన పంటకు పరిహారం అందక నాలికి అనిల్ అనే యువ రైతు కుటుంబాన్ని విషాదంలో ముంచి తనువు చాలించాడని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ సర్కార్ తెచ్చిన ఈ వ్యవసాయ సంక్షోభం నుంచి గట్టెక్కలేక అన్నదాతలు వరుసగా తమ నిండు ప్రాణాలు బలితీసుకుంటున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ పదేళ్ల ప్రస్థానంలో రైతుల ఆత్మహత్యలు 96 శాతం తగ్గాయని ఇటీవలే ఎన్‌సిఆర్‌బి నివేదిక తేల్చిచెబితే మళ్ళీ కాంగ్రెస్ పాలన రాగానే రైతు కుటుంబాల్లో ఈ మరణమృదంగం ప్రమాదఘంటికలు మోగిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. సమైక్య రాష్ట్రంలో ఉన్నప్పుడు జరిగిన స్థాయిలో మరోసారి తెలంగాణ గడ్డపై రైతుల ఆత్మహత్యలు చోటు చేసుకోవడం విషాదమే కాదు, ముంచుకొస్తున్న విలయానికి సంకేతమని అభిప్రాయపడ్డారు. రైతులకు మనోధైర్యాన్ని ఇస్తూ రైతన్నలారా అధైర్యపడకండి. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కేసీఆర్ సారథ్యంలో మళ్లీ వ్యవసాయాన్ని గాడిన పెట్టుకుందాం. అప్పటి వరకు సంఘటితంగా పోరాడదాం. రైతు వ్యతిరేక రేవంత్ సర్కారుకు బుద్ధి చెబుదామని భరోసా ఇచ్చారు.

# జోహో మెయిల్‌కు మారిన అమిత్ షా.. ఈ-మెయిల్ ఐడీ ఇదే!

దేశీయ ఉత్పత్తులు, సేవలను వినియోగించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ పిలుపును కేంద్ర మంత్రులు అందిపుచ్చుకుంటున్నారు. స్వదేశీ టెక్నాలజీని ప్రోత్సహించేందుకు, డిజిటల్ ఇండియాలో భాగంగా 'జోహో' ప్లాట్‌ఫామ్ వైపు మొగ్గుచూపుతున్నారు. అశ్వినీ వైష్ణవ్, ధర్మేంద్ర ప్రధాన్ ఆ సంస్థ సేవలు వినియోగిస్తుండగా.. కేంద్ర హోంమంత్రి అమిత్ షా జోహో మెయిల్‌లోకి మారిపోయారు. ఈ విషయాన్ని ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. ''హలో.. నేను జోహో మెయిల్‌కు మారాను. నా ఈమెయిల్ చిరునామాలో ఈ మార్పును గమనించండి. amitshah.bjp@ zohomail.in నా కొత్త మెయిల్ అడ్రస్'' అని అమిత్ షా తన పోస్టులో రాసుకొచ్చారు. ఇకనుంచి మెయిల్స్ అన్నీ ఈ కొత్త అడ్రస్‌కే పంపాలని చెప్పారు. భారత్‌పై అమెరికా సుంకాల మోత, జీఎస్టీ సంస్కరణల వేళ ప్రధాని మోదీ 'స్వదేశీ' పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. ''భారత్ బలమైన దేశంగా ఎదుగుతున్న వేళ.. కొన్ని సవాళ్లు తప్పవు. అటువంటి సమయాల్లో 'ఆత్మనిర్భర్' స్ఫూర్తిని



కొనసాగించాలి. ఈ నేపథ్యంలో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించండి'' అని ఎన్డీయే ఎంపీలకు సూచించారు. ఈ నేపథ్యంలోనే మంత్రులు జోహో సేవలను వినియోగిస్తున్నారు. జీమెయిల్, మైక్రోసాఫ్ట్ ఔట్‌లుక్‌కు పోటీగా జోహో మెయిల్‌ను తీసుకువచ్చారు. ఇప్పుడు ఈమెయిల్‌లోకి అమిత్ షా మారగా.. మైక్రోసాఫ్ట్ పవర్‌పాయింట్ బదులు జోహోతోనే కేబినెట్ ప్రంజెంటేషన్ తయారు చేసినట్లు అశ్వినీ వైష్ణవ్ వెల్లడించిన సంగతి తెలిసిందే. జోహో రూపొందిన మెసేజింగ్ యాప్ 'అరట్టై'ని వాడాలంటూ ధర్మేంద్ర ప్రదాన్ ఇంతకుముందు పిలుపునిచ్చారు. ప్రస్తుతం అరట్టైకు విశేష ఆదరణ లభిస్తోంది. ఈ యాప్‌ను విపరీతంగా డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. యూజర్ల ప్రైవసీ కోసం త్వరలోనే 'అరట్టై'లోనూ ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని జోహో సహ వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు తాజాగా వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇందులో సమాచార గోప్యతపై పెద్దఎత్తున చర్చ జరుగుతోన్న సమయంలో ఈ స్పందన వచ్చింది.

## ఇది అంతర్జాతీయ సమస్య..
# బెంగళూరు ట్రాఫిక్‌పై డీకేఎస్

బెంగళూరు ట్రాఫిక్‌పై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మరోసారి స్పందించారు. ట్రాఫిక్ రద్దీ అనేది అంతర్జాతీయ, జాతీయ సమస్య అని పేర్కొన్న ఆయన.. లండన్, దిల్లీ నగరాలను ఉదహరించారు. రాష్ట్రానికి ఉన్న ప్రాముఖ్యత, సోషల్ మీడియా స్వేచ్ఛ కారణంగా బెంగళూరులో ఈ సమస్య ప్రధానంగా వార్తల్లో నిలుస్తోందన్నారు. అయినప్పటికీ నగరంలో ట్రాఫిక్ కష్టాలకు ముగింపు పలకాల్సిన అవసరం ఉందన్నారు. ''లండన్‌లో ప్రజా రవాణా ఉపయోగించకపోతే గమ్యాన్ని చేరేందుకు గంటల సమయం పడుతుంది. దిల్లీలో ఎయిర్‌పోర్టు నుంచి పార్లమెంటుకు చేరుకోవాలంటే గంటన్నర పడుతుంది. కానీ, ముంబయి, చెన్నై, హైదరాబాద్ కంటే బెంగళూరులో ఎక్కువ ట్రాఫిక్ ఉంటోంది. అయితే, ఇతర రాష్ట్రాల మాదిరిగా మీడియా, సోషల్ మీడియాను అరికట్టడం లేదు. స్వేచ్ఛగా వదిలేస్తున్నాం. మేం విమర్శలను స్వాగతిస్తాం'' అని డీకేఎస్ అన్నారు. గ్రేటర్ బెంగళూరు అథారిటీపై ఏర్పాటు చేసిన ఓ చర్చా కార్యక్రమంలో డీకేఎస్ ఇలా మాట్లాడారు.



**నగర నిర్వహణ తేలిక కాదు..**

''బెంగళూరు నగర నిర్వహణ అంత తేలికైన విషయం కాదు. ఇక్కడ ప్రజలకు ఎన్నో అంచనాలు ఉన్నాయి. రవాణా, వ్యర్థాల నిర్వహణ, తాగునీరు వంటి అనేక ముఖ్యమైన సమస్యలు ఉన్నాయి. ఇది ప్రణాళికాబద్ధమైన నగరం కాదు. ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు కొత్త సొరంగాలు నిర్మిస్తున్నాం. ప్రజలు కూడా సహకరించాలి. వ్యర్థాల సమస్య పరిష్కారానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాం'' అని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# మేం అడిగిన సీట్లు ఇస్తారా..లేకపోతే: భాజపాకు మిత్రపక్షం వార్నింగ్

అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో బిహార్ రాజకీయాలు వేడెక్కాయి. అధికార ఎన్డీయే, విపక్ష మహాగఠ్‌బంధన్ కూటముల్లోని పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భాజపా మిత్రపక్షం హిందుస్థానీ అవామ్ మోర్చా 15 సీట్లు డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ చీఫ్ జీతన్ రామ్ మాంఝీ కీలక వ్యాఖ్యలు చేశారు. ''మాకంటూ ఒక గుర్తింపు ఉండాలంటే.. గౌరవప్రదమైన సీట్లు కావాలి. మేం 15 సీట్లు డిమాండ్ చేస్తున్నాం. ఆ సీట్లు ఇవ్వకపోతే ఎన్నికల్లో పోటీ చేయబోం. కానీ ఎన్డీయేలోనే కొనసాగుతాం. నేనేమీ ముఖ్యమంత్రిని కావాలని కోరుకోవడం లేదు. మా పార్టీకి గుర్తింపు కావాలని మాత్రమే ఆరాటపడుతున్నాం'' అని జీతన్ రామ్ అన్నారు. దీనిపై భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డా ఆయనతో మాట్లాడినట్లు తెలుస్తోంది. ఆయన్ని బుజ్జగించే ప్రయత్నాలు జరిగినట్లు సమాచారం. ఎన్డీయే కూటమిలో జేడీయూ, భాజపా, జీతన్ రామ్ మాంఝీకి చెందిన హిందుస్థానీ అవామ్ మోర్చా, చిరాగ్ పాసవాన్ ఆధ్వర్యంలోని లోక్‌జనశక్తి పార్టీ, ఉపేంద్ర కుశ్వాహా నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్‌సమతా పార్టీ భాగం. హెచ్ఏఎంకు ఏడు, ఆర్ఎల్ఎంకు ఆరు సీట్లు ఇచ్చేందుకు భాజపా సిద్ధమైనట్లు తెలుస్తోంది. కూటమిలో కీలక పార్టీలైన జేడీయూ, భాజపా సమానంగా సీట్లు తీసుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. చెరో 100 స్థానాల్లో పోటీ చేయొచ్చని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. నవంబరు 6, 11 తేదీల్లో



రెండు విడతలుగా బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అదే నెల 14వ తేదీన ఓట్ల లెక్కింపు పూర్తి కానుంది. బిహార్ ప్రస్తుత అసెంబ్లీ గడువు నవంబరు 22వ తేదీతో ముగియనుంది.

# భార్య వద్దన్నా విహారయాత్రకు వెళ్లి.. పంజాబీ గాయకుడు మృతి

పంజాబీ గాయకుడు రాజ్‌వీర్ జవాండా (35) బుధవారం మృతి చెందారు. భార్య వద్దన్నా విహారయాత్రకు వెళ్లిన ఆయనకు ఇటీవల ప్రమాదం జరిగింది. దీంతో 11 రోజులుగా వెంటిలేటర్‌పై ఉన్న ఆయన బుధవారం ప్రాణాలు కోల్పోయారు. అసలేం జరిగిందంటే.. జవాండా తన 1300 సీసీ మోటారు సైకిల్‌పై ఇటీవల హిమాచల్ ప్రదేశ్‌లోని శిమ్లాకు విహారయాత్రకు బయలుదేరారు. సోలన్ జిల్లా సమీపంలో అడ్డుగా వచ్చిన పశువులను ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంలో ఆయన తల, వెన్నెముకకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అక్కడి ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు.



పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో మొహాలీలోని ఓ ఆస్పత్రిలో చేర్చారు. దాదాపు 11 రోజులుగా ఆయన వెంటిలేటర్ పైనే ఉన్నారు. ఈ క్రమంలో తాజాగా ఆయన ప్రాణాలు కోల్పోయారు. అయితే, విహారయాత్రకు వెళ్లొద్దని జవాండా భార్య ముందుగానే హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఆమె మాటలు జవాండా వినలేదని ఆయన సన్నిహితులు పేర్కొంటున్నారు. ఇక, గాయకుడి మృతిపై ఆప్ నేత మనీశ్ సిసోదియా సహా పలువురు ప్రముఖులు, అభిమానులు సంతాపం వ్యక్తంచేశారు. జవాండా లుథియానా జాగ్రావ్‌లోని పోనా గ్రామానికి చెందిన వ్యక్తి. ఆయన పంజాబీలో పలు పాటలు పాడారు. పాటలు పాడటమే కాకుండా 'సుబేదార్ జోగిందర్ సింగ్', 'జింద్ జాన్', 'మిండో తసీల్‌దర్ని' వంటి చిత్రాల్లోను నటించారు.

## ప్రకృతి వైపరీత్యాల వేళ
# ఎస్ఐఆర్ ఎలా సాధ్యం?- మమతా బెనర్జీ



కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన వ్యవహారశైలి ప్రధాని తరహాలో ఉందని వ్యాఖ్యానించారు. ఉత్తర బెంగాల్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన అనంతరం కోల్‌కతా ఎయిర్‌పోర్టులో మీడియాతో మాట్లాడిన ఆమె.. ప్రకృతి వైపరీత్యాల వేళ ఓటరు జాబితా సవరణ సాధ్యం కాదన్నారు. ఈ సందర్భంగా అమిత్ షా తీరుపై దీదీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ''ఎన్నికలు జరగాల్సిన రాష్ట్రాల్లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టాలని ఎన్నికల కమిషన్‌పై భాజపా అగ్రనాయకత్వం ఒత్తిడి తెస్తోంది. ఆ పార్టీ నేతలు ఇక్కడకు వచ్చి సమావేశాలు పెడుతున్నారు. రాష్ట్రంలో ఓటరు జాబితా నుంచి లక్షలాది పేర్లను తొలగిస్తామని చెబుతున్నారు. పండగల వేళ ప్రకృతి వైపరీత్యాలు, భారీ వర్షాలతో రాష్ట్రం సతమతమవుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో పక్షం రోజుల్లో ఎస్ఐఆర్ పూర్తి చేసి, కొత్త పేర్లను చేర్చగలరా?'' అని మమతా బెనర్జీ ప్రశ్నించారు. ఈ వ్యవహారమంతా అమిత్ షా చేతుల్లో నడుస్తోందని.. దేశానికి తాత్కాలిక ప్రధాని అన్న రీతిలో ఆయన వ్యవహారం ఉందని ఆరోపించారు.

# సింగర్ జుబీన్ గార్గ్ కేసులో కీలక మలుపు.. కజిన్ అరెస్ట్

అస్సాంకు చెందిన ప్రముఖ గాయకుడు జుబీన్ గార్గ్ ఇటీవల సింగపూర్‌లో ప్రమాదవశాత్తూ మరణించిన సంగతి తెలిసిందే. ఆయన మృతిపై అనుమానాలు వ్యక్తమవుతోన్నవేళ ఈ కేసు కీలక మలుపు తిరిగింది. ఆయన కజిన్, అస్సాం పోలీస్ సర్వీస్ అధికారి సందీపన్ గార్గ్ అరెస్టయ్యారు. ఘటన జరిగిన సమయంలో అతడు జుబీన్‌తోనే ఉన్నారు. క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ వరుస విచారణలు జరిపిన తర్వాత తాజాగా సందీపన్‌ను అదుపులోకి తీసుకుంది. నార్త్ ఈస్ట్ ఇండియా ఫెస్టివల్ కోసం సింగపూర్ పర్యటనకు వెళ్లిన జుబీన్ సెప్టెంబర్ 19న ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. యాట్ పార్టీలో భాగంగా ఈతకు వెళ్లి చనిపోయినట్లు వార్తలు వచ్చాయి. సింగర్ పర్యటన వేళ సందీపన్ వెంటే ఉన్నాడని, అతడికి అది తొలి విదేశీ పర్యటన అని పోలీసు అధికారులు మీడియాకు వెల్లడించారు. యాట్ పార్టీలో కూడా పాల్గొన్నాడని, జుబీన్ మృతి తర్వాత ఆయన వస్తువులు కొన్నింటిని స్వదేశానికి తీసుకువచ్చాడని పేర్కొన్నారు. ఐదు రోజుల విచారణ తర్వాత అతడిని అదుపులోకి తీసుకున్నామని అస్సాం సీఐడీ స్పెషల్ డీజీపీ మున్నా గుప్తా వెల్లడించారు.



సందీపన్ అస్సాం పోలీసు విభాగంలో డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు . అతడితో కలిపి ఈ కేసులో ఇప్పటివరకు ఐదుగురు అరెస్టయ్యారు. అరెస్టయిన వారిలో జుబీన్ బ్యాండ్‌మేట్ శేఖర్ జ్యోతి గోస్వామి, కోసింగర్ అమృత్‌ప్రవ మహంత ఉన్నారు. వారు కూడా యాట్ పార్టీలో ఉన్నారు. జుబీన్‌కు అత్యంత సమీపంలో గోస్వామి ఈత కొడుతుండగా.. మహంత ఆ దృశ్యాలను రికార్డు చేసినట్లు వార్తలు వచ్చాయి. ఆయన మేనేజర్ సిద్ధార్థ్ శర్మ, నార్త్ ఈస్ట్ ఇండియా ఫెస్టివల్ మేనేజర్ శ్యాంకను మహంత కూడా పోలీసుల అదుపులో ఉన్నారు. ఇదిలా ఉంటే.. జుబీన్‌కు విషమిచ్చి ఉంటారని ఆయన బ్యాండ్‌మేట్ శేఖర్ జ్యోతి గోస్వామి సంచలన ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. గాయకుడి మేనేజర్ సిద్ధార్థ్ శర్మ, ఫెస్టివల్ ఆర్గనైజర్ ఈ కుట్రకు పాల్పడి ఉంటారని ఆరోపించారు. మునిగిపోతున్న సమయంలోనూ శర్మ 'అతన్ని వెళ్లనివ్వండి' అంటూ అరవడం తనకు వినిపించిందని గోస్వామి వెల్లడించారు. గార్గ్ శిక్షణ పొందిన స్విమ్మర్ అని, తనతో పాటు ఎంతోమందికి స్విమ్మింగ్‌లో కోచింగ్ ఇచ్చారని తన వాంగ్మూలంలో పేర్కొన్నారు. ఈవెంట్ ఆర్గనైజర్ మహంత ఆర్థిక వ్యవహారాల పైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. గతంలో మహంతా ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు అస్సాం సీఐడీ పోలీసులు గుర్తించారు. మరోవైపు.. అస్సాం గాయకుడికి చెందిన ఇద్దరు వ్యక్తిగత భద్రతా సిబ్బంది బ్యాంకు ఖాతాలను అధికారులు పరిశీలించారు. వారి ఖాతాల్లో దాదాపు రూ.కోటి లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. దీంతో గార్గ్ మరణంలో వారి ప్రమేయం ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారికి అంత డబ్బు ఎలా వచ్చిందనే దానిపైనా అధికారులు విచారణ చేస్తున్నారు.

# సాయుధ దళాల మధ్య సమన్వయానికి ఆపరేషన్ సిందూర్ నిదర్శనం: ఐఏఎఫ్ చీఫ్

భారతదేశ స్వదేశీ సామర్థ్యాలు, సాయుధ దళాల మధ్య ప్రభావవంతమైన సమన్వయానికి ఆపరేషన్ సిందూర్ ఒక ఉదాహరణ అని వాయుసేన అధిపతి ఏపీ సింగ్ పేర్కొన్నారు. 93వ వైమానిక దళ దినోత్సవంలో భాగంగా ఘజియాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా శత్రు భూభాగంపై కచ్చితమైన దాడులు చేసేందుకు స్వదేశంలో అభివృద్ధి చేసిన ఆయుధాలు అద్భుతమైన పనితీరు కనబరిచాయన్నారు. స్వదేశీ ఆయుధాలు మన విశ్వాసాన్ని వమ్ముచేయలేదన్నారు. కచ్చితమైన ప్రణాళిక, క్రమశిక్షణతో కూడిన శిక్షణ, నిర్ణీత అమలుతో ఏం సాధించవచ్చనేది ఈ ఆపరేషన్‌లో చూపించామన్నారు. వైమానిక దళాన్ని సమర్థమంతంగా ఎలా ఉపయోగించుకోవచ్చో ప్రపంచానికి చాటిచెప్పామన్నారు. 1948,



1971, 1999తో పాటు బాల్‌కోట్‌లో ఉగ్రవాదుల విధ్వంసం, ఆపరేషన్ సిందూర్‌లలో భారత వైమానిక యోధులు తమ పరాక్రమంతో చరిత్ర సృష్టించారన్నారు. ఈసందర్భంగా వారిని ఉద్దేశిస్తూ.. మనం దేశ గౌరవానికి సంరక్షకులమన్నారు. వైమానిక దళ సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అవసరమైతే మరింత శిక్షణ తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య ఘర్షణ నేపథ్యంలో ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా అక్కడి భారతీయ పౌరులను తిరిగి తీసుకురావడంలో వైమానిక దళం పాత్రను ఆయన అభినందించారు.

# కరూర్ తొక్కిసలాట ఘటన.. సుప్రీంకోర్టుకు విజయ్

టీవీకే చీఫ్ విజయ్ బుధవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కరూర్ తొక్కిసలాట ఘటన (Karur stampede)పై సిట్ దర్యాప్తునకు మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును ఆయన అత్యున్నత న్యాయస్థానంలో సవాల్ చేశారు. పార్టీకి వ్యతిరేకంగా సిట్ పక్షపాత వైఖరిని అవలంబిస్తోందని ఆరోపించారు. సీనియర్ ఐపీఎస్ అధికారి అస్రాగార్గ్ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటైంది. పోలీసుల దర్యాప్తు, అధికారుల పాత్రపై తాము ఇదివరకే ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ.. రాష్ట్ర పోలీసు అధికారులతోనే మద్రాస్ హైకోర్టు సిట్‌ను ఏర్పాటుచేసిందని టీవీకే తన పిటిషన్‌లో పేర్కొంది. తమ పార్టీపై సిట్ పక్షపాతంతో వ్యవహరిస్తోందని ఆరోపించారు. టీవీకే అధ్యక్షుడు విజయ్ (TVK chief Vijay)కు నాయకత్వ లక్షణాల్లేవని, ఘటన జరిగిన వెంటనే ఆ పార్టీ నేతలందరూ పారిపోయారని వ్యాఖ్యానించిన మద్రాసు హైకోర్టు... కరూర్ ఘటనపై ఆ పార్టీ తీరును తీవ్రంగా ఖండించిన సంగతి తెలిసిందే. తొక్కిసలాట తర్వాత అన్ని పార్టీలూ సహాయక చర్యలు చేపడితే, నిర్వాహకులు వెళ్లిపోయారని తప్పుపట్టిన సంగతి తెలిసిందే. ఈవిషయాన్ని టీవీకే పార్టీ తన పిటిషన్‌లో ప్రస్తావించింది. ఆ వ్యాఖ్యలు ఇప్పటికే దర్యాప్తును ప్రభావితం చేశాయని పేర్కొంది. తన ర్యాలీలో ఇబ్బందులు సృష్టించేందుకు ముందస్తు కుట్రలను తోసిపుచ్చలేమని ఆరోపించింది. టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ (Vijay) కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీ తీవ్ర విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలను కలిసేందుకు తనకు అనుమతివ్వాలంటూ డీజీపీకి విజయ్ మెయిల్ పంపారు. విషాదంలో ఉన్న బాధిత కుటుంబాలను స్వయంగా కలిసి పరామర్శించాలని కోరుకుంటున్నట్లు అందులో పేర్కొన్నారు. దీనికిముందు ఆయన బాధిత కుటుంబాలతో వీడియో కాల్‌లో మాట్లాడారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చిన ఆయన.. త్వరలోనే వారివద్దకు వస్తానని హామీ ఇచ్చారు.



ఈ ఘటనలో విజయ్ తప్పులేదని, ఆయన తన రాజకీయ ప్రయాణాన్ని కొనసాగించాలని వారు కోరారని టీవీకే నేత అరుణ్ రాజ్ వెల్లడించారు. ఇదిలాఉంటే.. తొక్కిసలాటలో మృతి చెందిన 13 ఏళ్ల బాలుడి తండ్రి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని కోరారు.

# షికాగో మేయర్‌ను జైలుకు పంపాలి ట్రంప్

అమెరికాలోని ఆయా రాష్ట్రాల్లో జాతీయ భద్రతా దళాలను ట్రంప్ యంత్రాంగం మోహరిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో షికాగో మేయర్ బ్రాండన్ జాన్సన్, ఇల్లినోయి గవర్నర్ జేబీ ప్రిట్కర్‌లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇమ్మిగ్రేషన్, అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ICE) అధికారులకు భద్రత కల్పించడంలో వారు విఫలమయ్యారని, వారిని జైల్లో పెట్టాలని అన్నారు. ఈ మేరకు సొంత సామాజిక వేదిక ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. అక్రమ వలసదారుల ఏరివేతలో భాగంగా ఇమ్మిగ్రేషన్ అధికారులు పలు రాష్ట్రాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో షికాగోలో స్థానికుల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

# ప్రతీ భారతీయుడి ఫోన్‌లో ఆ యాప్ ఉండాలి.. బండి సంజయ్ పిలుపు

జాతీయ విపత్తుల నిర్వహణ సేవల్లో జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అగ్రస్థానంలో ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. జాతీయ విపత్తుల సమయంలో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది అందిస్తున్న సేవలతోపాటు జాతీయ విపత్తుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేసేందుకు విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అధికారులను కోరారు. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'సచేత్ యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్ లోడ్ చేసుకునేలా చైతన్యం కలిగించాలని సూచించారు. ఎన్డీఆర్ఎఫ్ రెస్క్యూ సిబ్బందికి క్లిష్టమైన సమయాల్లో రోప్స్, గ్యాస్ కట్టర్స్, జాకెట్ వంటి మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి జాప్యం లేకుండా అందించాలని కోరారు. ఈరోజు న్యూఢిల్లీలోని ఎన్డీఎంఏ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ అథారిటీ)



సంస్థ ప్రధాన కార్యాలయాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్డీఎంఏ ఉన్నతాధికారులతో సమావేశమై సంస్థ అందిస్తున్న సేవలను, చేపడుతున్న కార్యాచరణను అడిగి తెలుసుకున్నారు. ఎన్డీఎంఏ సేవలకు సంబంధించి కేంద్ర మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. ప్రధానంగా తెలంగాణ, పంజాబ్, ఢిల్లీ వరదలతోపాటు సిక్కిం వరదలు, వయనాడ్ ల్యాండ్‌స్లైడ్, హిమాచల్ వరదల సమయంలో, బాలాసోర్ రైల్వే ప్రమాదం, సిల్క్యారా టన్నెల్ రక్షణ చర్యల్లో భాగంగా ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది అందించిన సాహసోపేత చర్యలను వివరించారు. Yuva Aapda Mitra Scheme కింద NCC, NYKS, BSG, NSS సంస్థల నుండి యువ వాలంటీర్లను చేర్చి, 28 రాష్ట్రాల్లో 2,37,326 వాలంటీర్లు మరియు 1,300 మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇవ్వబడింది, ఈ సంస్థలతో కలిసి విపత్తు స్పందన సేవల్లో యువతను భాగస్వామ్యం చేస్తున్నట్లు పేర్కొన్నారు. విపత్తు సేవలు అందించే విషయంలో జపాన్, రష్యా, జర్మనీ, మాల్దీవులు, చిలీసహా 14 దేశాలతో అంతర్జాతీయ అవగాహన ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపారు. అత్యధిక వర్షాలు, వరదలు, విపత్తులకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేసేందుకు 'సచేత్' యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 13.9 లక్షల డౌన్ లోడ్స్ చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా ఎక్కడ ఏ విపత్తు వచ్చే అవకాశం ఉందనే సమాచారం ప్రజలకు తెలుస్తుందని, తద్వారా ఆ విపత్తు నుండి బయటపడే అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అద్భుతమైన సేవలు అందిసున్నప్పటికీ సరైన ప్రచారం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో తుఫానులు, వరదలుసహా పెను ప్రమాదాలు ఏర్పడిన సమయంలో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సాహసోపేత సేవలు అందిస్తున్న విషయంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. ముఖ్యంగా సచేత్ (sachet)యాప్‌ను దేశ పౌరులంతా డౌన్ లోడ్ చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. రెస్క్యూ సిబ్బందికి జాకెట్, రోప్స్, గ్యాస్ కట్టర్స్ వంటి మౌలిక సదుపాయాలను కచ్చితంగా సమకూర్చాలన్నారు. దిశ మీటింగ్‌లో ఎన్డీఎంఏ సేవలను ఒక అంశంగా చేర్చే అంశాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. అంతిమంగా "ప్రతి భారతీయుడు -ప్రతి విపత్తుకూ సిద్ధంగా ఉండేలా సంసిద్ధులను చేయాలని కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు.



## గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికుడు మృతి.. 30 నిమిషాలు నిలిచిన రైలు..

హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న గోదావరి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో ఓ ప్రయాణికుడు మృతి చెందాడు. రైల్లోని మరుగుదొడ్డిలో గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. సమాచారం అందించినా రైల్వే వైద్యులు స్పందించలేదని మృతుని బంధువులు ఆందోళనకు దిగారు. దీంతో కాజీపేట రైల్వే స్టేషన్‌లో రైలు దాదాపు 30 నిమిషాల పాటు నిలిచిపోయింది.

## లైఫ్ సర్టిఫికెట్ పేరిట.. రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగికి టోకరా

హైదరాబాద్: లైఫ్ సర్టిఫికేట్ పేరిట నగరంలోని బర్కత్‌పురకు చెందిన ఓ రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. ఆయన వద్ద నుంచి రూ.12.99 లక్షలు కాజేశారు. విశ్రాంత ఉద్యోగి ఇటీవల ఫేస్‌బుక్‌లో పంజాబ్ నేషనల్ బ్యాంకు లైఫ్ సర్టిఫికేట్ పేరిట ఉన్న ఓ లింక్‌ను క్లిక్ చేశారు. సైబర్ పన్నాగం అని తెలియక.. బ్యాంకు అకౌంట్ వివరాలను అందజేశారు. అనంతరం బ్యాంక్ లోగో డీపీతో కేటుగాళ్లు వాట్సాప్‌లో ఆయన్ను సంప్రదించారు. లైఫ్ సర్టిఫికెట్ ప్రాసెస్ చేయడానికి అంటూ ఓ ఏపీకే ఫైల్ పంపించి ఇన్‌స్టాల్ చేయాలని సూచించారు. నిజమని నమ్మి ఆయన అలాగే చేశారు. కాసేపటికే ఆయన సేవింగ్ అకౌంట్ నుంచి రూ.12.99 లక్షలు



మాయమయ్యాయి. మోసపోయానని గ్రహించిన బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## తెలంగాణలో రెండు దగ్గు మందులపై నిషేధం

హైదరాబాద్: రెండు దగ్గు మందులను నిషేధిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రీలైఫ్, రెస్పీఫ్రెష్‌టీఆర్‌ను విక్రయించొద్దంటూ అందులో పేర్కొంది. ఈ రెండు దగ్గు మందుల్లోనూ కల్తీ జరిగినట్లు గుర్తించారు. వీటిని గుజరాత్‌కు చెందిన ఫార్మా కంపెనీల ఔషధాలుగా పేర్కొన్నారు. ఇటీవల మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో 'కోల్డ్‌రిఫ్' అనే దగ్గు మందు వాడడం వల్ల పలువురు చిన్నారులు మృత్యువాత పడ్డట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై దర్యాప్తు జరుగుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇప్పటికే



'కోల్డ్ రిఫ్'ను పూర్తిగా నిషేధిస్తున్నట్టు ఔషధ నియంత్రణ విభాగం (డీసీఏ) ప్రకటించింది.

## ఎన్నికల షెడ్యూల్ ప్రకారమే నామినేషన్ ప్రక్రియ
## పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్: తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాదులు బలమైన వాదనలు వినిపించారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో విచారణ రేపటికి వాయిదా పడిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారమే నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. గురువారం ఉదయం నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ



ఉంటుందన్నారు. బీసీ రిజర్వేషన్ల కేసు కచ్చితంగా గెలుస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. దాదాపు 90 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో కుల సర్వే జరిగిందని, బీసీల నోటి ముద్దను భాజపా లాగే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. బీసీల బిల్లుకు అసెంబ్లీలో అన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 90 శాతం స్థానాలు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

## తెలంగాణలో రేపటి నుంచి ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ల స్వీకరణ?

హైదరాబాద్: తెలంగాణలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు గురువారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. రేపు ఉదయం 10.30 గంటల నుంచి అధికారులు నామినేషన్లు స్వీకరించనున్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో రేపటి ఎన్నికల నోటిఫికేషన్‌ను నిలుపుదల చేస్తూ స్టే ఇవ్వాలని పిటిషనర్ కోరారు. అయితే, పిటిషనర్ విజ్ఞప్తిని హైకోర్టు ధర్మాసనం పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో రేపటి నుంచి ఎన్నికల ప్రక్రియ యథావిధిగా కొనసాగనుంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూలు ప్రకారం తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు.. ఆ తర్వాత సర్పంచి, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఐదు దశల్లో జరిగే ఎన్నికల ప్రక్రియ ఈనెల 9న ప్రారంభమై నవంబరు 11న ముగుస్తుంది. రెండు విడతల్లో జరిగే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు 9న (గురువారం).. మూడు విడతల్లో జరిగే సర్పంచి, వార్డు స్థానాల ఎన్నికలకు 17న నోటిఫికేషన్ విడుదల చేస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ప్రకటించిన విషయం తెలిసిందే.



### అక్కడ ఎన్నికల్లేవు

వివిధ కారణాలతో న్యాయస్థానాలు స్టే విధించిన కారణంగా 14 ఎంపీటీసీ, 27 సర్పంచి, 246 వార్డు స్థానాలకు ఎన్నికలను నిలిపివేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. ఇందులో ములుగు జిల్లా మంగపేట మండలంలోని 14 ఎంపీటీసీ, 25 సర్పంచి, 230 వార్డులుండగా.. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని రెండు సర్పంచి, 16 వార్డు స్థానాలకూ ఎన్నికలు నిర్వహించడం లేదని పేర్కొంది.

### ముగ్గురు పిల్లలుంటే అనర్హులే..

గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లలుంటే అనర్హత వేటు నిబంధన ఈ ఎన్నికల్లోనూ అమలు కానుంది. దీన్ని సడలించేందుకు పంచాయతీరాజ్ శాఖ ప్రతిపాదనలు సమర్పించినా.. జనాభా రేటుపై శాస్త్రీయ సమాచారం లేదనే కారణంతో ప్రభుత్వం తొలుత తిరస్కరించింది. ఆ తర్వాత ఇటీవల పునరాలోచన చేసినా... శాసనసభలో చట్టాన్ని సవరించాల్సి ఉన్నందున సమయాభావం కారణంగా జరపలేదు. దీంతో ముగ్గురు పిల్లలున్నవారు ఈ ఎన్నికల్లో పోటీకి అనర్హులని అధికారులు ప్రకటించారు.

* **ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్**
* మొదటి విడత ఎంపీటీసీ (2,963), జడ్పీటీసీ (292) ఎన్నికలు
* నామినేషన్ల స్వీకరణ ప్రారంభం: అక్టోబరు 9
* చివరి తేదీ: అక్టోబరు 11
* పరిశీలన: అక్టోబరు 12
* ఉపసంహరణ: అక్టోబరు 15
* రెండో విడత ఎంపీటీసీ (2,786) జడ్పీటీసీ (273) ఎన్నికలు
* నామినేషన్ల స్వీకరణ ప్రారంభం: అక్టోబరు 13
* చివరి తేదీ: అక్టోబరు 15
* పరిశీలన: అక్టోబరు 16
* ఉపసంహరణ: అక్టోబరు 19
* ఓటర్ల వివరాలిలా..
* రాష్ట్రంలో మొత్తం ఓటర్లు: 1,67,03,168
* పురుషులు: 81,65,894
* మహిళలు: 85,36,770
* ఇతరులు: 504

## 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు.. కానీ పాతవే భర్తీ చేశారు: కవిత

హైదరాబాద్: గ్రూప్ 1 అభ్యర్థులకు అండగా ఉంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. గన్ పార్కు అమరవీరుల స్తూపం వద్ద గ్రూప్ 1 అభ్యర్థులు చేపట్టిన ఆందోళనలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రిలిమ్స్ పరీక్షల నుంచే అవకతవకలు జరుగుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ పేరు కోసం బోగస్ ఉద్యోగాలు ఇవ్వొద్దని చెప్పారు. అభ్యర్థులు ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం కష్టపడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగుల పేరు చెప్పుకొని అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. రాహుల్ గాంధీ అశోక్



నగర్‌కు వచ్చి ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు. "పారదర్శకంగా పరీక్షలు పెట్టండి. 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చాక పాత ఉద్యోగాలే ఇచ్చారు. ఇవి తప్పుడు పరీక్షలు. కాంగ్రెస్ కోసం వారిని ఎంపిక చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడాలి. మిమ్మల్ని విద్యార్థులు నమ్మారు.. వారి పక్షాన నిలబడండి. మూల్యాంకనం సరిగా జరగాలి. కోర్టుల్లో జడ్జీలకు అర్థం అయ్యేదాకా పోరాటం చేస్తాం. గ్రూప్ 1 నియామకాలను రద్దు చేసి.. మళ్లీ పరీక్ష నిర్వహించాలి" అని కవిత డిమాండ్ చేశారు.

## భైంసా గతే భాగ్యనగరానికి పట్టబోతోంది.. ఎంఐఎం, కాంగ్రెస్‌పై రఘునందన్ రావు ఫైర్



జూబ్లీహిల్స్ బై పోల్ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎంఐఎం కుమ్మక్కు అయ్యాయని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. దేశంలో ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా అక్కడ బలం లేకపోయినా అక్కడ పోటీ చేసే ఎంఐఎం తెలంగాణలో పుట్టి ఇప్పుడు జరుగుతున్న జూబ్లీహిల్స్ లో తమ అభ్యర్థిని ఎందుకు నిలపడం లేదని ప్రశ్నించారు. దీని వెనుక ఉన్న కుట్ర ఏమిటో జూబ్లీహిల్స్ ప్రజలు ఆలోచించాలన్నారు. ఇవాళ నాంపల్లిలోని బీజేపీ స్టేట్ ఆఫీస్‌లో మీడియాతో మాట్లాడిన రఘునందన్ రావు.. జూబ్లీహిల్స్ బై పోల్‌లో ఎంఐఎం మద్దతు ఎవరికి ఇవ్వబోతోందని ప్రశ్నించారు. అన్న అసదుద్దీన్ ఓవైసీ కాంగ్రెస్ కు మద్దతు ఇద్దామంటే తమ్ముడు అక్బరుద్దీన్ ఓవైసీ బీఆర్ఎస్‌కు మద్దతు ఇద్దామని అనుకుంటున్నారని, ఎంఐఎం కూడా రెండుగా విడిపోయిందా అని ప్రశ్నించారు. డిసెంబర్‌లో రాబోతున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎంఐఎంకు మేయర్ పదవి ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ లోపాయికారి ఒప్పందం చేసుకుందని మజ్లీస్ సూచించిన వ్యక్తికే జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వబోతోందని అన్నారు. జూబ్లీహిల్స్ లో బీజేపీ గెలిచి ఆ తర్వాత హైదరాబాద్ మేయర్ పీఠం గెలవబోతోందనే భయంతోనే ఈ రెండు పార్టీలు కుమ్మక్కు అయ్యాయని ఉమ్మడి అభ్యర్థిని ప్రకటించబోతున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ఎంఐఎం వ్యక్తి హైదరాబాద్ మేయర్ అయితే భైంసాకు భాగ్యనగరానికి తేడా లేకుండా పోతుందని ఆరోపించారు.

# అమ్మకాల ఒత్తిడి..

## నష్టాల్లో ముగిసిన మార్కెట్లు..!



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిశాయ. ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ మినహా అన్ని రంగాల్లో అమ్మకాలు కనిపించాయి. దాంతో మార్కెట్లు ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. ప్రపంచ మార్కెట్లలోని సానుకూల పవనాలతో మార్కెట్లు ఉదయం ఫ్లాట్‌గానే మొదలయ్యాయి. ఆ తర్వాత మార్కెట్లు లాభాల్లోకి దూసుకెళ్లాయి. ఆ తర్వాత కొద్దిసేపటికే మార్కెట్లు నష్టాల్లోకి జారుకున్నాయి. చివరికి స్వల్పంగా కోలుకోవడంతో భారీ నష్టాల నుంచి బయటపడ్డాయి. ఉదయం 81,899.51 పాయింట్ల ప్రారంభమైన సెన్సెక్స్.. ఇంట్రాడేలో 81,646.08 పాయింట్ల కనిష్టానికి చేరుకుంది. అత్యధికంగా 82,257.74 పాయింట్ల గరిష్టానికి పెరిగింది. చివరకు 153.09 పాయింట్లు తగ్గి.. 81,773.66 వద్ద ముగిసింది.

నిఫ్టీ సైతం 62.15 పాయింట్లు తగ్గి 25,046.15 వద్ద ముగిసింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.7శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.4శాతం పతనమయ్యాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్ 0.7 శాతం, ఐటీ 1.5శాతం లాభపడ్డాయి. ఇక రియాల్టీ, టెలికాం, ఫార్మా, ఆయిల్ అండ్ గ్యాస్, మీడియా, పీఎస్‌యూ బ్యాంక్, ఆటో 0.3శాతం నుంచి 2శాతం వరకు పతనమయ్యాయి. నిఫ్టీలో టాటా మోటార్స్, అల్ట్రాటెక్ సిమెంట్, జియో ఫైనాన్షియల్, ఓఎన్‌జీసీ, ట్రెంట్ నష్టాల్లో ముగియగా.. టైటాన్ కంపెనీ, ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, మ్యాక్స్ హెల్త్‌కేర్ లాభపడ్డాయి. రూ.695.83 ఫ్లోర్ ధరతో క్యూఐపీని ప్రారంభించిన తర్వాత అనంత్ రాజ్ షేర్లు 5శాతం తగ్గాయి. రూ.707 కోట్ల విలువైన ఆర్డర్ల తర్వాత సాత్విక్ గ్రీన్ ఎనర్జీ షేర్లు 10శాతం వృద్ధి చెందింది.

క్యూవన్ లాభం 67శాతం పెరిగినప్పటికీ మంగళసూత్ర షేర్ల శ్రింగర్ హౌస్ 2శాతం పతనమయ్యాయి. అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి నీలా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ షేర్ ధర 11శాతం పెరిగింది. ది కార్డ్ కంపెనీతో సహకారంతో డ్రీమ్‌ఫోక్స్ సర్వీసెస్ షేర్ ధర 5శాతం పెరిగింది. జాగ్వార్ ల్యాండ్ రోవర్ క్యూ2 హోల్‌సేల్స్ 24.2శాతం తగ్గడంతో టాటా మోటార్స్ షేర్లు 2.5శాతం పడిపోయాయి. క్యూ2లో రూ.4,570 కోట్ల ప్రీసేల్స్ ఉన్నప్పటికీ లోధా డెవలపర్స్ షేర్లు 1.5శాతం తగ్గాయి. త్రైమాసిక గణాంకాలు మెరుగ్గా ఉండడంతో టైటాన్ షేర్లు 4శాతం పెరగ్గా.. బార్వాహ్ ప్లాంట్‌లో తయారీ ప్రారంభించడంతో అసోసియేటెడ్ ఆల్కహాల్, బ్రూవరీస్ షేర్లు దాదాపు 3శాతం వృద్ధిని నమోదు చేశాయి. ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్, ఆర్‌బీఎల్ బ్యాంక్, ఎంఆర్‌ఎఫ్, హీరో మోటోకార్ప్, కెనరా బ్యాంక్, గాబ్రియేల్ ఇండియా, యాత్ర ఆన్‌లైన్, అథర్ ఎనర్జీ, టైమెక్స్ గ్రూప్, ఇంద్రప్రస్థ మెడికల్, నెట్‌వెబ్, ఐనాక్స్ గ్రీన్, జీఆర్ఎం ఓవర్సీస్, వీ2 రిటైల్ వంటి 120 కంటే ఎక్కువ స్టాక్‌లు బీఎస్ఈలో 52 వారాల గరిష్ట స్థాయికి చేరుకున్నాయి.

# అదృష్టంగా భావిస్తున్నా..

## వారికి నోబెల్ బహుమతి వరించడంపై సుందర్ పిచాయ్ ఆనందం




**న్యూఢిల్లీ:** ఈ ఏడాది భౌతికశాస్త్రంలో ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ బహుమతి దక్కింది. జాన్ క్లార్క్, మిషెల్ డెవోరెట్, జాన్ ఎం మార్టినిస్‌లకు సంయుక్తంగా అవార్డును ప్రకటించారు. వీరికి గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ అభినందనలు తెలిపారు.

ఎలక్ట్రిక్ సర్క్యూట్‌లో సంభవించే ఎనర్జీ క్వాంటిజేషన్‌పై చేపట్టిన డిస్కవరీకి గుర్తింపుగా వారిని ఈ పురస్కారం వరించింది. ముగ్గురిలో ఇద్దరు గూగుల్ సంస్థలో పనిచేస్తున్న శాస్త్రవేత్తలు కావడం విశేషం. మిషెల్ డెవోరెట్.. గూగుల్ క్వాంటమ్ ఏఐ ల్యాబ్‌లో హార్డ్‌వేర్ చీఫ్ సైంటిస్ట్‌గా, జాన్ మార్టినిస్ హార్డ్‌వేర్ టీమ్‌కి చాలా ఏళ్లుగా నాయకత్వం వహించారు. ఈ నేపథ్యంలో వారికి ఈ అత్యున్నత పురస్కారం దక్కడంపై సుందర్ పిచాయ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

'భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన మిషెల్ డెవోరెట్, జాన్ మార్టినిస్, జాన్ క్లార్క్‌లకు అభినందనలు. మిషెల్ మా క్వాంటమ్ ఏఐ ల్యాబ్‌లో హార్డ్‌వేర్ చీఫ్ సైంటిస్ట్‌గా, జాన్ మార్టినిస్ చాలా ఏళ్లుగా హార్డ్‌వేర్ టీమ్‌కి నాయకత్వం వహించారు. ఐదు మంది నోబెల్ గ్రహీతలు ఉన్న కంపెనీలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా' అంటూ సుందర్ పిచాయ్ తన ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది.

# బంగారం ఆల్‌టైమ్ హై..

## తులం రూ.1.26 లక్షలు



**న్యూఢిల్లీ:** ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి కారణంగా బంగారం ధరలు ఆకాశమే హద్దుగా దూసుకెళ్తున్నాయి. కనీవినీ ఎరుగని రీతిలో రికార్డుల్ని బద్దలుకొడుతున్న పసిడి ధరలు.. రాకెట్ వేగంతో పైపైకి పరుగులు పెడుతున్నాయి. బంగారం ధర నేడు మరింత పెరిగింది. ఒక్కరోజే రూ.2,290 పెరిగి ఆల్‌టైమ్ హైకి చేరింది. బుధవారం హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర తొలిసారి రూ.1,26,070కి ఎగబాకింది. అదే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,16,750కి చేరింది. మరోవైపు వెండి ధర కూడా బంగారంతో పోటీపడి మరీ పెరిగిపోతోంది. హైదరాబాద్‌లో కిలో వెండి రూ.1.58 లక్షలుగా ఉందని మార్కెట్ వర్గాలు తెలిపాయి.

పసిడి ధరలు పెరగడానికి అనేక కరాణాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ట్రంప్ అధిక టారిఫ్‌లు, అంతర్జాతీయ భౌగోళిక పరిస్థితులకు తోడు అమెరికా ఫెడరల్ గవర్నమెంట్ షట్‌డౌన్ కూడా ఓ కారణంగా పేర్కొంటున్నాయి. వడ్డీరేట్లను ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ఇంకా తగ్గిస్తుందన్న అంచనాల మధ్య మదుపరులు తమ పెట్టుబడులను సురక్షిత సాధనమైన పుత్తడి వైపునకు మళ్లిస్తున్నారు. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. దీంతో పసిడి ధరలు అంతకంతకూ పెరుగుతూపోతున్నాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.




# బీసీసీఐ జట్టును 'భారత జట్టు' అని పిలవడంపై పిటిషన్...

### తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఢిల్లీ హైకోర్టు

### టీమిండియా' పేరుపై వివాదం

### ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని తోసిపుచ్చిన ఢిల్లీ హైకోర్టు

### కోర్టు సమయాన్ని వృథా చేయవద్దని హితవు

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆధ్వర్యంలోని జట్టును 'భారత జాతీయ క్రికెట్ జట్టు'గా పిలవడాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. ఈ వ్యాజ్యంపై విచారణ సందర్భంగా పిటిషనర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం, ఇలాంటి వాటితో కోర్టు సమయాన్ని వృథా చేయవద్దని హితవు పలికింది.

ప్రభుత్వ ఆధీనంలోని దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో వంటి ప్రసార సంస్థలు బీసీసీఐ జట్టును 'టీమిండియా'గా పేర్కొనడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ న్యాయవాది రీపక్ కన్సల్ ఈ పిల్ దాఖలు చేశారు. బుధవారం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్ రావు గెడెలతో కూడిన ధర్మాసనం పిటిషనర్‌పై ప్రశ్నల వర్షం కురిపించింది.

"ప్రపంచవ్యాప్తంగా ఆడుతున్న ఆ జట్టు భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడం లేదని మీరు చెబుతున్నారా? బీసీసీఐని పక్కనపెట్టండి... దూరదర్శన్ లేదా మరేదైనా సంస్థ ఆ జట్టును




టీమిండియాగా చూపిస్తే, అది భారత జట్టు కాకుండా పోతుందా?" అని ధర్మాసనం సూటిగా ప్రశ్నించింది. క్రీడల్లో ప్రభుత్వ జోక్యం ఉంటే అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ఎంత కఠినంగా వ్యవహరిస్తుందో తెలుసా అని కూడా ధర్మాసనం గుర్తుచేసింది. ఈ వ్యాజ్యం విచారణకు స్వీకరించడం పూర్తిగా సమయం వృథా చేయడమేనని అభిప్రాయపడింది. "ఇకపై మంచి ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేయండి" అని పిటిషనర్‌కు సూచిస్తూ కేసును కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది.

### పిటిషనర్ వాదన ఏమిటి?

బీసీసీఐ అనేది తమిళనాడు సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం కింద నమోదైన ఒక ప్రైవేట్ సంస్థ అని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 12 ప్రకారం అది 'ప్రభుత్వ' పరిధిలోకి రాదని పిటిషనర్ తన వ్యాజ్యంలో వాదించారు. కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ కూడా బీసీసీఐని జాతీయ క్రీడా సమాఖ్య (ఎన్ఎస్ఎఫ్)గా గుర్తించలేదని, ఆర్టీఐ ద్వారా ఈ విషయం వెల్లడైందని పేర్కొన్నారు.

అయినప్పటికీ, ప్రభుత్వ ప్రసార సంస్థలు బీసీసీఐ జట్టును 'టీమిండియా' అని, 'భారత జాతీయ జట్టు' అని సంబోధిస్తూ జాతీయ జెండాను ఉపయోగించడం చట్టవిరుద్ధమని ఆరోపించారు. ఇది ప్రజలను తప్పుదోవ పట్టించడమే కాకుండా, ఒక ప్రైవేట్ సంస్థకు అనవసరమైన వాణిజ్య ప్రయోజనం చేకూరుస్తుందని పిటిషన్‌లో వివరించారు. ఈ చర్యలు చిహ్నాలు, పేర్ల (అక్రమ వినియోగ నిరోధక) చట్టం-1950, ఫ్లాగ్ కోడ్ ఆఫ్ ఇండియా-2002ను ఉల్లంఘించడమేనని తెలిపారు.

# మోసం చేస్తే ఆ బంధం ఇన్నేళ్లు ఎలా కొనసాగుతుంది..?

### ధనశ్రీ చీటింగ్ ఆరోపణలపై చాహల్

**న్యూఢిల్లీ:** టీమ్‌ఇండియా క్రికెటర్ యజువేంద్ర చాహల్, ధనశ్రీ వర్మ ఇటీవలే తరచూ వార్తల్లో నిలుస్తున్నారు. ప్రేమ, పెళ్లి, విడాకులు, వివాదాలు, ఆరోపణలతో వీరిద్దరూ నిత్యం హెడ్‌లైన్స్‌లో నిలుస్తున్నారు. ప్రేమించి వివాహం చేసుకున్న ఈ జంట ఈ ఏడాది మార్చిలో విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత నుంచి తమ బంధం గురించి ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు చేసుకుంటున్నారు. చాహల్‌తో తన వివాహ బంధం గురించి ధనశ్రీ ఇటీవలే షాకింగ్ కామెంట్స్ చేశారు. ఆ బంధం మొదటి నుంచీ ఇబ్బందుల్లోనే ఉందని పేర్కొన్నారు. వివాహం జరిగిన రెండు నెలల్లోనే చాహల్ మోసం బయటపడిందంటూ చెప్పుకొచ్చారు.

ఈ నేపథ్యంలో ధనశ్రీ ఆరోపణలపై చాహల్ తాజాగా స్పందించారు. చీటింగ్ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'నేను ఓ క్రీడాకారుడిని. ఎవరినీ మోసం చేయను. నాకు పెళ్లై 4.5 సంవత్సరాలైంది. పెళ్లైన రెండు నెలల్లోనే మోసం చేస్తే ఆ బంధం ఇన్నేళ్లు ఎలా కొనసాగుతుంది..? ' అంటూ ప్రశ్నించారు. 'నేను ఈ అధ్యాయాన్ని మర్చిపోయాను. ఎవరైనా ఏదైనా చెప్పొచ్చు. అది వెంటనే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఒక అంశంపై వంద కథనాలు వ్యాపిస్తాయి. అయితే, నిజమేంటన్నది కొందరికే తెలుసు. పెళ్లి అధ్యాయం ముగిసింది. దాని గురించి నేను మళ్లీ



ప్రస్తావించదలచుకోలేదు. ప్రస్తుతం నేను జీవితం, ఆటపై దృష్టి పెట్టాను' అని చెప్పుకొచ్చారు. ఇక రిలేషన్‌షిప్ స్టేటస్ గురించి చాహల్ స్పందిస్తూ.. ప్రస్తుతం తాను ఒంటరిగానే ఉన్నానని స్పష్టం చేశారు.

### చాహల్-ధనశ్రీ విడాకులు..

దంత వైద్యురాలైన ధనశ్రీ 2020 డిసెంబర్ 22న చాహల్‌ను వివాహం చేసుకుంది. కొరియోగ్రాఫర్‌గా, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా తనకంటూ గుర్తింపు తెచ్చుకుంది ధనశ్రీ. పెళ్లి తర్వాత వీళ్లిద్దరూ ఇన్‌స్టాలో రీల్స్ చేస్తూ ఫ్యాన్స్‌ను అలరిస్తూనే ఉన్నారు. అయితే, ఇద్దరి మధ్య వచ్చిన మనస్పర్థలు విడాకులకు దారి తీశాయి. 2020లో వీరి వివాహం జరగగా 2022 నుంచే ఈ ఇద్దరూ విడివిడిగా ఉంటున్న ఈ జంట ఈ ఏడాది ఫిబ్రవరిలో ముంబై ఫ్యామిలీ కోర్టులో విడాకులకు దరఖాస్తు చేసుకున్నారు. ఇక ఈ ఏడాది మార్చి 20న వీరికి విడాకులు మంజూరయ్యాయి.

# ఐసీసీ ర్యాంకింగ్స్‌లో జడేజా, సిరాజ్ పైపైకి!

### వెస్టిండీస్‌పై ఆల్ రౌండ్ షో.. కెరీర్ బెస్ట్ ర్యాంక్ సాధించిన జడేజా

### ఆల్ రౌండర్ల జాబితాలో అగ్రస్థానం మరింత పదిలం

### బౌలింగ్‌లో అదరగొట్టిన సిరాజ్.. 12వ స్థానానికి ఎగబాకిన వైనం

### సెంచరీలతో మెరిసిన రాహుల్, జురెల్.. ర్యాంకింగ్స్‌లో భారీ జంప్

**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌తో అహ్మదాబాద్‌లో జరిగిన తొలి టెస్టులో అద్భుత ప్రదర్శన కనబరిచిన భారత ఆటగాళ్లు ఐసీసీ ర్యాంకింగ్స్‌లో సత్తా చాటారు. ముఖ్యంగా, ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా బ్యాటింగ్‌లో తన కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంకును అందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అజేయ శతకంతో (104 నాటౌట్) రాణించిన జడేజా, ఏకంగా 25వ స్థానానికి ఎగబాకాడు. ఈ ఏడాది జులైలో సాధించిన 29వ ర్యాంకే ఇప్పటివరకు అతడి అత్యుత్తమ స్థానం. తాజా ప్రదర్శనతో 644 రేటింగ్ పాయింట్లను సొంతం చేసుకున్నాడు.

ఇక ఆల్ రౌండర్ల జాబితాలో జడేజా తన అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు పడగొట్టడంతో, రెండో స్థానంలో ఉన్న బంగ్లాదేశ్ ఆటగాడు మెహిదీ హసన్‌పై తన ఆధిక్యాన్ని 125 పాయింట్లకు పెంచుకున్నాడు.




భారత పేసర్ మహమ్మద్ సిరాజ్ కూడా తన కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంకును సాధించాడు. ఇంగ్లండ్ పర్యటనలో కనబరిచిన ఫామ్‌ను కొనసాగిస్తూ, ఈ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి ఏడు వికెట్లు (4/40, 3/31) తీశాడు. దీంతో మూడు స్థానాలు మెరుగుపరచుకుని బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో 12వ స్థానానికి చేరుకున్నాడు. అంతేకాకుండా, తొలిసారిగా 700 పాయింట్ల మార్కును దాటాడు.

భారత్ ఇన్నింగ్స్ 140 పరుగుల తేడాతో గెలిచిన ఈ మ్యాచ్‌లో సెంచరీలు సాధించిన కేఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్ కూడా ర్యాంకింగ్స్‌లో మెరుగయ్యారు. రాహుల్ నాలుగు స్థానాలు ఎగబాకి 35వ ర్యాంకుకు, అరంగేట్ర సెంచరీ చేసిన జురెల్ ఏకంగా 20 స్థానాలు ఎగబాకి 65వ ర్యాంకుకు చేరుకున్నారు. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ కూడా ఏడు స్థానాలు మెరుగుపరచుకుని 21వ స్థానంలో నిలిచాడు. మరోవైపు, వెస్టిండీస్ జట్టు నుంచి ఏ ఒక్క బ్యాటర్ అర్ధ సెంచరీ చేయలేకపోగా, ఏ బౌలర్ కూడా రెండు కంటే ఎక్కువ వికెట్లు తీయలేకపోయాడు.

# ఒలింపిక్ మెడలిస్ట్ అమన్‌కు భారీ షాక్.. ఏడాది నిషేధం

### పారిస్ ఒలింపిక్స్ పతక విజేత అమన్ సెహ్రావత్‌పై వేటు

### ఏడాది పాటు అన్ని పోటీల నుంచి నిషేధించిన రెజ్లింగ్ సమాఖ్య

### ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో అధిక బరువుతో అనర్హత

### క్రమశిక్షణారాహిత్యమే కారణమన్న సమాఖ్య

### అమన్ ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదని వెల్లడి

**పారిస్:** పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్‌కు భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) భారీ షాక్ ఇచ్చింది. క్రమశిక్షణారాహిత్యం కింద అతనిపై ఏడాది పాటు నిషేధం విధిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. సీనియర్ ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో నిర్దేశిత బరువు కంటే ఎక్కువగా ఉండటంతో ఈ కఠిన చర్యలు తీసుకున్నట్లు వెల్లడైంది.

ఇటీవల క్రొయేషియాలో సెప్టెంబర్ 13 నుంచి 21 వరకు సీనియర్ ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ జరిగింది. ఈ టోర్నీలో పతకంపై గట్టి ఆశలతో బరిలోకి దిగిన అమన్, పురుషుల 57 కేజీల ఫ్రీస్టైల్ విభాగంలో పోటీ పడాల్సి ఉంది. అయితే, పోటీలకు ముందు నిర్వహించే బరువు తూకంలో అతను విఫలమయ్యాడు. పరిమితికి మించి 1.7 కిలోలు ఎక్కువగా ఉండటంతో అధికారులు అతడిని పోటీల నుంచి అనర్హుడిగా ప్రకటించారు. ఈ టోర్నీలో భారత్ తరపున అంతిమ్ పంఘల్ మాత్రమే మహిళల 53 కేజీల విభాగంలో కాంస్య



పతకం సాధించింది.

ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన భారత రెజ్లింగ్ సమాఖ్య, సెప్టెంబర్ 23న అమన్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసి వివరణ కోరింది. దీనిపై సెప్టెంబర్ 29న అమన్ తన స్పందనను సమర్పించాడు. అయితే, అతని వివరణ సంతృప్తికరంగా లేదని క్రమశిక్షణ కమిటీ తేల్చిచెప్పింది. ఒలింపిక్ పతక విజేతగా ఉండి కూడా వృత్తిపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై సమాఖ్య తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.

"జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అన్ని రకాల రెజ్లింగ్ కార్యకలాపాల నుంచి మిమ్మల్ని ఏడాది పాటు సస్పెండ్ చేస్తున్నాం. ఈ నిర్ణయమే అంతిమం" అని అమన్‌కు పంపిన లేఖలో రెజ్లింగ్ సమాఖ్య స్పష్టం చేసినట్లు ఈఎస్పీఎన్ తన కథనంలో పేర్కొంది. ఈ నిషేధ కాలంలో సమాఖ్య నిర్వహించే ఏ పోటీల్లోనూ పాల్గొనడానికి వీల్లేదని స్పష్టం చేసింది.

ఈ వ్యవహారంలో అమన్‌తో పాటు అతని కోచింగ్ సిబ్బందిపై కూడా సమాఖ్య దృష్టి సారించింది. చీఫ్ కోచ్ జగ్‌మందర్ సింగ్‌తో పాటు మరో ముగ్గురు సహాయక సిబ్బందిని వివరణ కోరింది. ఛాంపియన్‌షిప్‌కు ముందు అథ్లెట్ బరువును పర్యవేక్షించడంలో ఎందుకు విఫలమయ్యారని వారిని ప్రశ్నించింది.

MOVIE TIME

# మాస్ జాతర నుంచి మరో పాట

**ఓటేటోలే పాటపై విమర్శలను తిప్పికొట్టిన రవితేజ**



**టాకీస్:** రవితేజ హీరోగా శ్రీలీల హీరోయిన్‌గా కొత్త దర్శకుడు భాను భోగవరపు తెరకెక్కించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మాస్ జాతర'. అక్టోబర్ 31న రిలీజ్ కానుంది. ఈనేపథ్యంలో 'హుడియో హుడియో' పాటను విడుదల చేయనున్నారు. చిట్టి చిలకా.. చిన్న మొలకా..అంటూ సాగే లిరిక్స్‌ను దేవ్ రాయగా అబ్దుల్ వహాబ్, భీమ్స్ సిసిరోలియో ఆలపించారు. ఇటీవల ఇందులోని 'ఓలే ఓలే' లిరికల్ సాంగ్‌ను రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ పాట లిరిక్స్‌లో అసభ్య పదాలు ఉన్నాయిని విమర్శలు వచ్చాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో రవితేజ, దర్శకుడు ఈ విమర్శలపై స్పందించారు. కొన్నిటిపై బోల్డ్ మూవీలు అనే ముద్ర వేస్తారు. అలాంటి వాటితో ఎవరికీ ఇబ్బంది రాదు. కానీ, వారికి నా సినిమాతో మాత్రమే సమస్య వచ్చింది. మా గ్రామాల్లో స్థానికంగా జరిగే ఉత్సవాల్లో కొంతమంది చిన్న చిన్న కథలను పాటలుగా చెబుతుంటారు. వాళ్లు తిట్టుకున్నట్లు అనిపిస్తుంది కానీ, వాస్తవానికి వాళ్లు చాలా ప్రేమగా మాట్లాడుకుంటారని దర్శకుడు భాను అన్నారు. విమర్శలు చేసేవారు కేవలం పాటలోని కొన్ని పదాలను మాత్రమే చూస్తున్నారు. తర్వాత వచ్చే సరదా సంభాషణలను చూడడం లేదు. సినిమా చూశాక ఈ పాట వెనక ఉన్న అసలు కథ మీకు అర్థమవుతుంది. ప్రేక్షకులకు అందరికీ ఈ పాట నచ్చుతుంది. అయినా ఇప్పుడు ఇంగ్లిష్‌లో కొన్ని పదాలు సాధారణం అయిపోయాయి. వాటిని తెలుగులో చెప్పినప్పుడే కొందరికి సమస్య వస్తుందని రవితేజ చెప్పారు.

## మళ్లీ అవకాశాలు పట్టుకుంటున్న పూజా

**టాకీస్:** ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న మోస్ట్ టాలెంటెడ్ భామల్లో టాప్‌లో ఉంటుంది పూజాహెగ్డే. తమిళం, హిందీ, తెలుగు భాషల్లో టాప్ స్టార్లతో కలిసి నటించి వన్ ఆఫ్ ది లీడింగ్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగింది. ఈ పొడుగు కాళ్ల సుందరికి తెలుగులో హిట్ పడక చాలా కాలమే అవుతుంది. తెలుగులో కూడా బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంటున్న మాలీవుడ్ స్టార్ యాక్టర్ దుల్కర్ సల్మాన్. ఈ లీడింగ్ హీరో రవి నెలకుడిటి దర్శకత్వంలో ఓ తెలుగు సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్‌లో జెట్ స్పీడ్‌లో షూటింగ్ కొనసాగుతోంది. ఈ సినిమాతో లాంగ్ గ్యాప్ తర్వాత పూజా హెగ్డే మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. తాజా కథనాల ప్రకారం ఈ సినిమా కోసం పూజా హెగ్డే ఏకంగా రూ.3 కోట్లు పారితోషికం తీసుకుంటుందని టాక్. అయితే రెమ్యునరేషన్ భారీగా డిమాండ్ చేస్తున్న కారణంగా పూజాహెగ్డే తెలుగు సినిమాలకు దూరమైందని కొన్ని రోజుల క్రితం వార్తలు చక్కర్లు కొట్టాయి. కానీ దుల్కర్ సల్మాన్ టీంకు ఈ విషయంలో ఎలాంటి అభ్యంతరాలు లేకపోవడంతో పూజా హెగ్డేను తమ టీంలోకి తీసుకుందట. ఇక ఈ పుకార్లకు ఫుల్ స్టాప్ పెడుతూ తెలుగులో దుల్కర్ సల్మాన్ సినిమాతో మళ్లీ ఫాంలోకి రావాలని చూస్తున్నట్టు అర్థమవుతుంది. ఇటీవలే రజినీకాంత్ నటించిన కూలీ సినిమాలో మోనికా సాంగ్‌లో మెరిసింది పూజా హెగ్డే. ఈ పాటలో అందాలు ఆరబోస్తూ కుర్రకారుకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. కూలీ సాంగ్ భారీ హిట్ అయింది. ఇక దుల్కర్ సల్మాన్ సినిమా బ్లాక్ బస్టర్ అయితే పూజాహెగ్డేకు తెలుగులో మళ్లీ మంచి రోజులు వచ్చినట్టేనని చెప్పొచ్చు.



## ఓటీటీలోకి వార్-2 ఎంటర్

**టాకీస్:** బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్, టాలీవుడ్ స్టార్ నటుడు ఎన్టీఆర్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం వార్. కియారా అద్వానీ ఈ సినిమాలో కథానాయికగా నటించగా.. అనిల్ కపూర్, అశుతోష్ రాణా, అలియాభట్, బాబీ దేవోల్, శర్వారీ వాఘ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించగా.. యష్‌రాజ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఆదిత్య చోప్రా నిర్మించాడు. ఈ చిత్రం ఇండెపెండెన్స్ కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చి మిక్స్‌డ్ టాక్ తెచ్చుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ చిత్రం అక్టోబర్ 9 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ప్రకటించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఇండియన్ రా ఏజెన్సీలో ప్రముఖుడైన ఏజెంట్ కబీర్(హృతిక్) కిరాయి హంతకుడిగా మారి హత్యలు చేస్తుంటాడు. ఇదిలావుంటే.. చైనా, రష్యా, శ్రీలంక, మయన్మార్, బంగ్లాదేశ్ దేశాలన్నీ ఒక కోటరీగా మారి, 'కలి' పేరుతో ఇండియా పతానానికి ప్లాన్ చేస్తాయి. ఈ మిషన్‌ని కబీర్‌కు అప్పజెబుతాయి. కబీర్‌ను అడ్డుకునేందుకు విక్రమ్ చలపతి (జూనియర్ ఎన్టీఆర్) రంగంలోకి దిగుతాడు. అసలు కబీర్‌కీ, విక్రమ్‌కు మధ్య ఉన్న బంధం ఏంటి? 'కలి' వల్ల భారత ప్రధానికి పొంచివున్న ముప్పును వీరిద్దరూ ఎలా ఆపారు? ఈ మిషన్‌లో వింగ్ కమాండర్ కావ్య లూత్ర(కియారా అద్వానీ) పాత్ర ఏంటి? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ.






# పాలరాతి శిల్పానికి ఇది పరీక్షా కాలమే

**ఎంట్రీతోనే బ్లాక్ బస్టర్ అందుకున్న బ్యూటీ**

**హ్యాట్రిక్ హిట్ తో సంచలనం**

**ఆ తరువాత మారిన గ్రాఫ్**

**కోలీవుడ్‌పైనే ఫోకస్ పెట్టిన కృతి శెట్టి**

టాకీస్: తెలుగు తెరపైకి ఈ మధ్య కాలంలో టీనేజ్ లో వచ్చిన హీరోయిన్ ఎవరైనా ఉన్నారా అంటే అది 'కృతి శెట్టి' అనే చెప్పాలి. తన వయసుకు తగిన పాత్రలో ఆమె చేసిన 'ఉప్పెన', సంచలన విజయాన్ని నమోదు చేసింది. తొలి సినిమాతోనే 100 కోట్ల విజయాన్ని సాధించడంతో, ఈ బ్యూటీ ఎక్కడికో వెళ్లిపోతుందని అంతా అనుకున్నారు. నిజంగానే ఆ తరువాత ఆమెకి ఆ స్థాయిలోనే అవకాశాలు వచ్చాయి. అవి హిట్ చిత్రాల జాబితాలోకి చేరిపోయాయి కూడా.. అయితే ఆ తరువాత నుంచే ఆమెకి ఇక్కడ కష్టకాలం మొదలైంది. హిట్లు ఎలా వరుసగా వచ్చి వాలాయో, ఫ్లాపులు కూడా అలాగే వచ్చి పడ్డాయి. శంఖంలో పోస్తేనే తీర్థం అయినట్టు, సక్సెస్ లో ఉంటేనే ఎవరికైనా క్రేజు .. డిమాండు ఉంటాయి. అలాంటి సక్సెస్ లేకపోవడంతో కృతి కోలీవుడ్ బాట పట్టింది. అక్కడ ఉంటూనే మల్లూవుడ్ పైనా ఒక లుక్ వేసింది. అయితే మలయాళంలో ఆమెకి '%జూ=వీ%'తోనే పెద్ద హిట్ పడింది. ఆమె కాస్త తేలికగా ఊపిరి పీల్చుకునేలా చేసింది. ఇక తమిళంలో ఆమె కార్తీ సరసన నటించిన 'వా వాథియర్'ను ఈ దీపావళికి రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ కొన్ని కారణాల వలన డిసెంబర్ 5వ తేదీకి వాయిదా పడింది. కుమారస్వామి దర్శకత్వం వహించిన ఈ సినిమాపై అంచనాలు ఉన్నాయి. విఘ్నేశ్ శివన్ దర్శక నిర్మాతగా రూపొందించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' కూడా డిసెంబర్ 18న విడుదల కానుంది. ప్రదీప్ రంగనాథ్ జోడీగా ఈ సినిమాలో ఆమె సందడి చేయనుంది. ఈ రెండు సినిమాలు ఆమె కెరియర్ కి చాలా కీలకమని చెప్పాలి. ఈ సినిమాలతో ఆమె కోలీవుడ్లో హవా కొనసాగిస్తుందేమో చూడాలి.

## కాంతారా ఎఫెక్ట్ కోసం చాలా కష్టపడ్డాం

**సినిమాటోగ్రాఫర్ అరవింద్ కశ్యప్**



**టాకీస్:** ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద మంచి టాక్‌తో ప్రేక్షకులను అలరిస్తున్న చిత్రం 'కాంతార: చాప్టర్1. రిషబ్‌శెట్టి స్వీయ దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీ కథ, కథనాలతోనే కాకుండా, విజువల్స్ పరంగానూ ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా టైగర్ సీక్వెన్స్, యాక్షన్ సన్నివేశాలు, రథంపై యుద్ధం, సహజమైన అడవుల్లో తీర్చిదిద్దిన సన్నివేశాలు సినిమాకు ఫ్రెష్‌లుక్‌ను తీసుకొచ్చాయి. ఈ విజువల్ వండర్ వెనక రిషబ్‌శెట్టి విజన్‌తో పాటు, సినిమాటోగ్రాఫర్ అరవింద్ కశ్యప్ విజన్ కూడా ఉంది. తాజాగా ఈ సినిమా మేకింగ్ వెనక ఉన్న ఆసక్తికర విషయాలను అరవింద్ పంచుకున్నారు. కాంతార: చాప్టర్1' 95 శాతం చిత్రీకరణ కర్ణాటకలోని కుందాపురలోనే తీశాం. దాదాపు రెండేళ్ల పాటు చిత్రబృందం అంతా అక్కడే ఉంది. షూటింగ్ జరిగినన్ని రోజులు ఒత్తిడి, నిద్ర లేని రాత్రులు గడిపాం. కానీ, సవాళ్లు స్వీకరించినప్పుడే అసలైన ప్రతిభ బయటపడుతుంది. రోజూ నేను లైట్లతో ప్రయోగాలను చేసేవాడిని. దర్శకుడు అనుకున్నట్లు సీన్ వచ్చేవరకూ ఏ విషయంలోనూ అస్సలు వెనక్కి తగ్గేవాళ్లం కాదు. అటవీ ప్రాంతంలో సరైన లైటింగ్ ఎఫెక్ట్ రావడానికి ఒక్కోసారి వారాల సమయం పట్టేదన్నారు. ఈ మూవీలో ప్రేక్షకులను విశేషంగా అలరించింది టైగర్ సీక్వెన్స్. ముఖ్యంగా పిల్లాడి చుట్టూ పులి తిరుగుతుంటే తెరపై ఆ సన్నివేశాన్ని చూసే ప్రేక్షకుడి ఒళ్లు గగుర్పొడిచింది. 'పులికి సంబంధించిన అన్ని సన్నివేశాలను షూటింగ్ మొదలుపెట్టిన సంవత్సరంలోనే తీసేశాం. నిజంగా పులి నడుచుకుంటూ వస్తే, ఎక్కడెక్కడ నీడ పడుతుంది? బిడ్డ చుట్టూ ఉన్న ఆకులు, ఆ వాతావరణం ఎలా కనపడాలి? ఇలా అన్నింటినీ పరిగణనలోకి తీసుకొని, ఆ సీన్‌ను తీశాం. రిషబ్‌లో ఉత్సాహం అనంతం. అతడు నటిస్తుంటే, మొత్తం సెట్ దాన్ని ఫీలయ్యేది. ముఖ్యంగా గులిగా కనిపించే ఎమోషనల్ సీన్స్ ఒకట్రెండు టేక్స్‌లోనే ఓకే చేయాలి. లేకపోతే, అన్నిసార్లు ఆ స్థాయి భావోద్వేగాలు రావని అన్నారు. యువరాణి కనకవతి గుర్రంపై వచ్చే సన్నివేశం తెరకెక్కించడం మాకు కాస్త కష్టమనిపించింది. ఆ లొకేషన్ అడవిలో చాలా దూరం. కొత్తపుర నుంచి దాదాపు గంటన్నర పాటు ప్రయాణం చేయాల్సివచ్చేది. మరో అరగంట నడుచుకుంటూ వెళ్లాలి. ఆ తర్వాత 45 నిమిషాల పాటు ఒక కొండను ఎక్కి దిగాల్సి వచ్చేది. కేవలం మూడు నిమిషాల నిడివి గల సీన్‌కు నాలుగు రోజులు షూట్ చేశాం. ఇక వాతావరణం కూడా చాలాసార్లు ఇబ్బందిపెట్టేది. ఈ విషయంలో ప్రొడక్షన్ టీమ్‌కు హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే. వర్షం మొదలైన నిమిషాల్లోనే అంతా క్లియర్ చేసేవాళ్లు. ఒకసారి భారీ వర్షం కారణంగా మేము నిర్మించిన బ్రిడ్జ్ కూడా కొట్టుకుపోయింది. దీంతో వారం పాటు అడవిలోనే ఉండాల్సివచ్చింది. ఇలా మొత్తం 200 రోజులు షూటింగ్ చేశాం అని అరవింద్ కశ్యప్ చెప్పుకొచ్చారు.

## లోక సినిమాతో హిట్ సాధించిన కళ్యాణి

**టాకీస్:** లోక సినిమాతో రూటు మార్చేసింది కళ్యాణి ప్రియదర్శన్. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద బిగ్గెస్ట్ హిట్‌గా నిలువడమే కాదు.. నిర్మాతలకు కాసుల వర్షం కురిపించింది. అత్యధిక గ్రాస్ సాధించిన సౌతిండియన్ ఫీ మేల్ సెంట్రిక్ మూవీగా నిలిచింది. మాలీవుడ్ లో గత రికార్డులు బీట్ చేసి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచింది. కళ్యాణి ప్రియదర్శన్ మళ్లీ గ్లామరస్ అవతార్‌లోకి మారిపోయింది. ఎవరూ ఊహించని విధంగా సూపర్ గ్లామర్ రోల్‌లో దర్శనిమిచ్చింది కళ్యాణి ప్రియదర్శన్. ఈ భామ కమర్షియల్ సినిమా హీరోయిన్‌గా ట్రాన్స్‌ఫార్మేషన్ అయిన తీరుకు షాక్ అవుతున్న ఫాలోవర్లు,



నెటిజన్లు.. ఈ సాంగ్‌లో వేసిన స్టెప్పులకు ఫిదా అవుతున్నారు.గ్లామరస్ పాత్ర గురించి కళ్యాణి ప్రియదర్శన్ మాట్లాడుతూ.. ఓ యాక్టర్‌గా నేను ఇదివరకెన్నడూ చేయని పాత్రలను చేయాలని నాకు నేను చాలెంజింగ్‌గా తీసుకుంటా. ఈ పాటలో అలాంటి కొన్ని మూమెంట్స్ ఉన్నాయి. నా డైరెక్టర్ భువనేశ్ ఈ విషయం గురించి నాకు చెప్పినప్పుడు.. అతడు ఉ।నితి। కథకు చాలా ముఖ్యమైన అందమైన కమర్షియల్ మ్యూజికల్ పీస్‌ను అద్భుతంగా ఎలా తీశాడోనని అనిపించింది. దీనివెనుకున్న కారణాలు చాలా శక్తివంతమైనవి. ఏదైనా కొత్తగా చేయాలని.. చాలా బాగా కష్టపడటం జరిగింది. మీరంతా ఈ పాటను ఇష్టపడతారని ఆశిస్తున్నానని చెప్పుకొచ్చింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.